# భాగవత సూక్తము



మాస్టర్ పార్వతీకుమార్

# భాగవత సూక్తము

(మాస్టర్ కె.పి.కె. గారి భాగవత ప్రవచనముల నుండి)

**మాస్టర్ పార్వతీకుమార్**

**ధనిష్ఠ**

ప్రథమ ముద్రణ : 07-11-2020 ప్రతులు : 1,000

(మాస్టర్ పార్వతీకుమార్ గారి
75 వసంతముల పరిపూర్తి సందర్భముగా)

© ధనిష్ఠ ఫౌండేషన్, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

వెల : **రూ. 80-00**

ప్రతులకు :
**ధనిష్ఠ ఫౌండేషన్,**
15-7-1, ఏంజిల్స్ ఎన్‌క్లేవ్,
కృష్ణనగర్, విశాఖపట్నం - 530 002
ఫోన్ : 0891-2701531, 2509154,
website : www.dhanistha.org.
info@dhanistha.org
ISBN : 978-81-89467-58-6

ముద్రణ :
**సత్యం ఆఫ్‌సెట్ ఇంప్రింట్స్**
విశాఖపట్నం-530 016.
ఫోన్ : 0891-2796538, 9849996538.

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

"**ధనిష్ఠ**" అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువలేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

"**ధనిష్ఠ**" మాస్టర్ పార్వతీకుమార్ గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

"**ధనిష్ఠ**" ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

# భాగవత సూక్తము

భాగవతము తెలిసి పలుకుట చిత్రంబు... అను విషయమును పరిపూర్ణముగా, అనుభవపూర్వకముగా తెలిసినవారు మాస్టర్ పార్వతీకుమార్‌గారు.

చిన్ననాటి నుండి భాగవత స్పర్శా స్ఫూర్తి కలిగిన పుణ్యజీవి. వారి జీవిత పరమార్థముగూడ భాగవత జీవనమే అన్నట్లుగా, మాస్టర్ ఇ.కె.గారు కూడ దశాబ్దముల క్రిందట ''భాగవత దర్శనము'' వారి ప్రవచన విషయముగా సూచించి నిర్ణయించుట మరియు మాస్టర్ ఇ.కె. గారి భాగవత రహస్య ప్రకాశ వివరణా ప్రణాళిక వీరి ద్వారా నిర్వర్తింపబడుట మొదలగున వన్నియు ప్రస్తుత భాగవత ప్రవచనా యజ్ఞమునకు నాందిగా కనిపించును.

మాస్టర్ పార్వతీకుమార్ గారు మాస్టర్ ఇ.కె. విరచిత రహస్య ప్రకాశము సమగ్రముగ అవగాహన చేసుకొనినవారు. ఆ ప్రాతిపదికను ఉపాధిగా శ్రీమద్భాగవత ప్రవచనమును ఒక యజ్ఞముగా స్వీకరించి, తనను తాను ఉద్ధరించుకొనుట కొరకు

ఈ ప్రవచనములని, ఆసక్తి కలవారు పాల్గొనవచ్చునని సాధకులకు సూచన చేసి మరీ ప్రారంభించుట విశేషము.

ఈ ప్రవచన యజ్ఞము జనరంజకమై అత్యంత విశేష, సాధనాపరమైన రహస్యములతో వేలాదిమందికి (అనువాదముతో విదేశీయులు సహితము) కరదీపికయై, నిత్య యోగజీవన సాధనగా వ్యాప్తి చెందుట భగవంతుని అనుగ్రహము.

ఈ యజ్ఞమునకు ఆకర్షితులైన **శ్రీమతి కె. సుజాత, నవగోపికా సంఘము, భాగ్యనగరం బృందము** అత్యంత శ్రద్ధాభక్తులతో లిఖించి, వేలాదిమందికి అందజేయుట వారి భక్తికి నిదర్శనం. ప్రతిదినము ప్రభాతమున ఈ ఉపదేశములు ''రాధామాధవమ్'' వాట్సాప్ గ్రూప్ నందు సాధకులకు దర్శనమిచ్చును.

ఈ పవిత్ర యజ్ఞమునకు ఆకర్షితులైన **శ్రీ యన్.వి.యస్. మూర్తి పుణ్యదంపతి** *''మాస్టరుగారి 75 వసంతముల పరిపూర్తి''* సందర్భముగా బృందమునకు అందజేయు శుభ సంకల్పము చేసిరి. ఈ యజ్ఞములో పాల్గొన్న వారందరికీ మాస్టరుగారి శుభాశీస్సులు! మాస్టరుగారి నుండి వెలువడిన ఈ పవిత్రమైన యజ్ఞము భగవదర్పితము.

తేది : 07-11-2020

**ధనిష్ఠ**



# భాగవత సూక్తము

# 1

శ్రీమద్భాగవతము మన వాఙ్మయములో పరాకాష్ఠ. శ్రీచక్రముగా మన వాఙ్మయాన్ని మనము దర్శనము చేస్తే, అందులో బిందుస్వరూపమే 'శ్రీమద్భాగవతము'. సమస్త గ్రంథములకు సంగమము లాంటిది. పరిపూర్ణమైన సమన్వయమును అందించిన ఏకైక గ్రంథము. అనుభూతి పరమైనది. భాగవతము ప్రత్యేకత ఏమిటంటే అందులో రమణీయత ఉన్నది. అందుచేత పఠనము చేసుకుంటూ ఉంటూనే భగవదనుభూతిని పొందవచ్చు.

# 2

మనము ప్రతి నిత్యము ప్రాతఃసమయములో స్మరించవలసిన వారిలో నారదమహర్షి ఒకరు. సృష్టిలో జీవుల కొరకు దిగివచ్చిన మహత్తరమైన ప్రజ్ఞ నారదుడు. మన మేధస్సుకు అందే ప్రజ్ఞ కాదు. భక్తి, జ్ఞానము, దైవము గురించి తెలుసుకోవాలనే తపన ఉన్నప్పుడు మనలో ఊర్ధ్వ లోకాలలో పనిచేస్తాడు. ప్రాపంచిక విషయాల గురించి తపన ఉన్నప్పుడు కలహభోజనుడిగా ఉంటాడు. మాస్టర్ ఇ.కె. గారు చెప్పిన ముఖ్యమైన విషయము ఏమిటంటే నారదుడు మనని గురించిన భావన చేసినపుడు మాత్రమే మనము ఆయన గురించి భావన చేయగలము. నారదుడు ఆకాశమంతా నిండి ఉన్నాడు కాబట్టి మనము స్మరించినంత మాత్రమున ఆశీర్వదించడము జరుగుతుంది. సృష్టిలో ప్రతి వ్యక్తి దేహము నందును నారదుని అంశ ఉండును. జీవులు హరి నామమును గానము చేయ ప్రయత్నించినపుడల్లా నారదునితో సంబంధం యేర్పడును.

# 3

సనకుడు, సనందనుడు, సనత్కుమారుడు, సనత్సుజాతుడు- ఈ నలుగురు బ్రహ్మమానస సృష్టి. యోగసాధనలో మోక్షము కోరినవారి మనసులలో వీరు సన్నిధి చేసి ఊర్ధ్వగతికి సహకరిస్తారు. భక్తి యోగమునకు వీరందరును సృష్టి యందు ఆచార్యులు. భక్తి అనునది ఉన్నదని మానవుని మనస్సుకు తట్టుట వీరివలననే. వీరందరూ మనలో ఉన్నారు. వీరిని మనలో దర్శించుకొని ఆరాధన చేసినా, ఆరాధన చేసి దర్శించినా ఆ ప్రజ్ఞలు మనలో మేల్కొంటాయి. వీరికి పంచభూతము లంటవు. భౌతిక, మానసిక శరీరములుండవు. వీరు భావలోకములోనే గోచరిస్తారు.

# 4

'వ్యాసుడు' అను పదమునకు విస్తరించి చెప్పువాడని అర్థము. ప్రవహించే చైతన్యము కలిగినవాడు. కేంద్రము నుంచి పరిధికి, ఏకాత్మ నుండి పరమాత్మకు ప్రవహించు శక్తి కలిగినవాడు. కలియుగ లక్షణములు మొదలైన సమయములో శుభమును, శాంతిని యిచ్చునది, రసానుభూతితో కూడినటువంటిది అయిన భాగవతము సూర్యోదయము లాగా వ్యాసునిచే అందింపబడినది.

## 5

ఏ జీవి అయినను శుకయోగి యొక్క నామమును భక్తితో విన్నను, ఉచ్చరించినను, తన స్థితిని ప్రసాదించునట్టి మహిమ గల పరమగురువు. కృష్ణుడు వేణువు ఊదితే అందరూ 'గో' లోకాలలోకి, సమాధి స్థితిలోకి వెళ్లిపోయారు. శుకయోగి కృష్ణుని వేణువును తన కంఠముగా వాడి, భాగవతమును ప్రవచనము చేసి ఆ స్థితిని కలుగచేశాడు. తపస్సు చేసుకొని సంపాదించే 'ధీ' అనే వెలుగు ఏదైతే ఉన్నదో అలా ఉన్న సమూహాలన్నింటిలో మణివలె ప్రకాశిస్తాడు శుకుడు. అతని నామమును వ్యాసుడు పిలిచినపుడు ప్రకృతి అంతా దైవప్రజ్ఞ యందు మేల్కొనినది. వృక్షములకు అప్పటికప్పుడు క్రొత్త చిగుళ్లు వచ్చినవి. నిత్యము స్మరింపవలసిన వారిలో శుకయోగి ఒకరు.

## 6

'సూతుడు' అన్న పదమునకు పరబ్రహ్మ తత్త్వమును పిండి యిచ్చు వాడని అర్థము. వేదవ్యాసుడు యిచ్చిన వాఙ్మయమును పిండి అందులో ఉండే సారాన్ని బాగా లోతులలోకి వెళ్లిపోయి పరిపూర్ణముగా తెలుసుకొని మనకు అనుభూతిని, స్ఫూర్తిని అందించేటటువంటి వాడు సూతుడు. లేకపోతే మనకు పురాణాలు అర్థము కావు. ''సాధన చేసేవారు సమస్తమును వైభవోపేతమైనటువంటి శ్రీకృష్ణుడి (అంతర్యామి దైవము)గా దర్శనం చేయాలని'' మొదటి ప్రాథమిక సూత్రాన్ని చెప్తూ సూతమహర్షి భాగవతానికి సింహద్వారము తెరిచారు. (ఆవు పొదుగులో పాలు ఉంటాయి కాని పిండేవాడు పిండి మనకు యిస్తేనే గదా తాగుతాము.) ఆ పని ఎవరు చేస్తే, అది సూతపీఠము అవుతుంది.

# 7

దేవకీదేవి గర్భములో పెరుగుతున్నటువంటి శిశువు మీద మంత్రోచ్చారణతో ఏర్పడినటువంటి పంచభూతములతో కూడిన శరీరముతో పురాణపురుషుడు తన్ను తాను ఆపాదించుకుంటాడు. అందుచేత శ్రీకృష్ణుని చుట్టూ ఒక దివ్యమైనటువంటి చతుర్భుజములతో కూడిన దేహము ఎప్పుడూ ఆవరించి ఉంటుంది. అది సత్కార్యములు చేస్తున్నటువంటి వారిని (వారి పవిత్రతను బట్టి, చేసే కార్యాలను బట్టి) ఆవహించి కార్యాలను నిర్వర్తిస్తూ ఉంటుంది. ఆ దేహము భూమి మీద ఉన్నటువంటి అత్యంత దివ్యమైన మైత్రేయ మహర్షిని ఆవరించియున్నది. అందుచేతనే ఆ మహర్షిని కీర్తించేటపుడు ''దివ్య దేహాయ'' అంటాము. ఈ భూమి మీద ప్రస్తుతము సాక్షాత్తూ విష్ణుమూర్తి ఎవరు అంటే మైత్రేయ మహర్షి అని చెప్తుంది భాగవతము.

## 8

సద్గురువుయిచ్చే ఉపదేశము ఎప్పుడూ బుద్ధిలోకముల నుండి జరుగును. శిష్యుడు మనో లోకములో ఉంటాడు. గురువు చెప్పినది క్రమముగా చేసుకుంటూ వెడితే శిష్యుడు మనసు నుంచి బుద్ధిలోకి వెడతాడు. కేవలము మనసులో ఉన్నవారికి తెమలడము ఉండదు. బుద్ధిలోకి పెరగాలంటే హృదయములో (స్పందనము ఉన్న చోట) దేవుడున్నాడని తెలిసి ఆరాధన చేయాలి. ఇది తెలియచెప్పడానికి సద్గురువులు మన మధ్యకు వచ్చి సులభమైన పదములతో పెద్ద పెద్ద సందేశములు యిస్తున్నారు.

## 9

నైమిశారణ్యములో శౌనకాది మునులు భగవత్ చింతన వేయి సంవత్సరములు పెట్టుకున్నారు. కొన్నివేల మంది మనకు భగవంతుని అనుగ్రహము కావాలి, కలిస్పర్శ తగలకూడదు అని పూర్ణమైన స్ఫూర్తితో చేరితే- భగవంతుడు సంతోషించి సూతుడిని పంపించాడు. దైవీ కార్యక్రమమునకుగాని, భాగవతము వినడానికి గాని రావడము, రాకపోవడము జీవుని నిర్ణయము కాదు. దైవము యొక్క అనుగ్రహము దానికి రెండవ ప్రక్కన ఉంటుంది. నేను వచ్చాను అనుకుంటే రావడానికి వీల్లేకుండా సన్నివేశాలు రావచ్చు. ఏ నిర్ణయము లేకుండా అప్రయత్నముగా రావచ్చు. ఈ విద్యను ప్రతిపాదించు శాస్త్రము కనుక భాగవతము అన్నిటికన్నా శ్రేష్ఠమైనది.

## 10

రెప్పపాటు కాలానికి సంబంధించిన సమయాన్ని ఏమాత్రము వృథా చేయకుండా తత్త్వజ్ఞానమును మాత్రమే వినడానికి ఎవరైతే ఉంటారో, అలాగే శ్రద్ధా భక్తులతో భగవతత్త్వము గురించి ఎల్లప్పుడూ ప్రవచించుకుంటూ ఉంటారో ఆ ప్రదేశమును (చుట్టూ అడవి లేకపోయినా) నైమిషము లేక నైమిశారణ్యము అన్నారు. మాస్టర్ ఇ.కె. గారు ఏడు సంవత్సరములు రాధామాధవములో భాగవతము వ్రాస్తున్నపుడు నైమిషము యిక్కడే ఉన్నది అన్నారు.

## 11

విష్ణుకథలు విందామనుకోవడమే భగవదను గ్రహము. అనుకొని వినగలగడము మరింత అనుగ్రహము. చెప్పే సద్గురువు దొరకడము విశేషమైన అనుగ్రహము. అటుపైన వినుటలోని శ్రద్ధను బట్టి అనుగ్రహము ఎల్లప్పుడు ఉంటుంది. సద్గురువు వద్దకు ఏ జీవుడు చేరినా పూర్వ పుణ్య విశేషము వలన మాత్రమే. అందరూ కూడా సద్గురువు సమాశ్రయములోకి రాలేరు. వచ్చినా అందరికీ ఏకాగ్రత, పరతత్త్వము గురించి తపన ఉండదు. సద్గురువు సమాశ్రయము పొందడమే మహాభాగ్యము. దానిని సద్వినియోగము చేసుకొనడం ఒక సిద్ధి. ఒక శిష్యుడు తన సద్గురువు వద్దకు చేరే లోపల 12 జన్మల నుంచి గురు మార్గాన్ని అనుసరిస్తూ ఉంటాడు అని మన గ్రంథాలు చెప్పాయి.

## 12

భాగవతములో విషయములు తెలియడము వలన ఉపయోగము లేదు. అనుభూతి కలగదు. భాగవతము వినడము పూర్వపుణ్య విశేషము. విన్నదాని యందు రుచి కలగడము మరింత పుణ్యవిశేషము. అది మనలో బాగా నరనరములలో జీర్ణించుకు పోవడమన్నది మననుండి పెద్దలు కోరేటటువంటి ఒక సాధన. భాగవతము ఆకళింపు కాకపోతే గుండ్రాయి మీద నీళ్ళు పోసినట్లే. నీళ్ళు జారిపోతాయి గాని యింకవుగా. పరమగురువులు మధ్య మధ్యలో యిలా హెచ్చరిస్తుంటారు.

## 13

అమ్మవారు భగవంతుని నుంచి వ్యక్తమై ఆయననే కొలుస్తూ ఉంటుంది. శ్రీ (లక్ష్మీదేవి) అంటే వెలుగు, కళ, సౌభాగ్యము, ఐశ్వర్యము, శోభ, వైభవము, ఆరోగ్యము, తృప్తి. ఇంద్రియ ప్రవర్తనలో, భావములలో ఎంత పవిత్రత, స్వచ్ఛత, శుచి పెరిగినకొద్దీ అంత అమ్మవారి అనుగ్రహానికి పాత్రుల మవుతాము (More & more purification in all levels). ఆ తరువాత ఆవిడ మనలను ఒళ్ళో కూర్చోబెట్టుకొంటుంది (కృష్ణుడిని ఎత్తుకున్న యశోద బొమ్మ). తరువాత మనలను partnerగా చేసుకొంటుంది (అర్ధనారీశ్వర తత్త్వము). నువ్వు నాతో పాటు వుండు అంటుంది. అపుడు స్వామిత్వము యిస్తుంది.

## 14

మార్పు లేని మనస్సుతో నిత్యము భగవంతుని కథలు చెప్పుట, వినుట వలన కలిగినటువంటి శ్రద్ధ మరియొక మార్గమున పెరగదు. అటువంటి శ్రద్ధ మనలను సాధనలో నియమిస్తుంది. అపుడు భక్తి పెరిగి, దైవము నందు రుచి కలిగి, తర్కించే బుద్ధి తగ్గుతుంది. మనలో మన గురించిన భావన కన్నా, భగవంతుని గూర్చిన భావన ఎక్కువవుతుంది. కర్మబంధములు తొలగుతాయి. సరాసరి జ్ఞానసముపార్జన చేసేటటువంటి వారికి మిగిలేది అహంకారమే. భక్తి లేని జ్ఞానము మనిషిని పతనావస్థకు తెస్తుంది.

# 15

స్త్రీ విషయము చెపుతూ మాస్టరుగారు యిలా అన్నారు. మొదటి స్థితి ప్రకృతి చేత ఆదరింపబడడము. రెండవస్థితి ప్రకృతిని తనతో సమానముగా గౌరవించడము. మూడవ స్థితి ప్రేమతో ప్రకృతి కార్యాన్ని నిర్వర్తించే స్థితి. నాలుగవది ప్రకృతి మన మార్గానికి అన్నివిధాలా సహకరించేటట్లుగా ఉండడము. ఇట్లా నాలుగు రకాలుగా చెపుతారు జీవుడిని. కాళి క్రింద తొక్కబడుతున్న జీవుడిని, యశోద ఎత్తుకొన్న పిల్లవాడిని, అర్ధనారీశ్వరుడైన మూర్తిని, హృదయములో ప్రకృతిని నిక్షిప్తము చేసుకొన్న వెంకటరమణ మూర్తిని చెపుతారు. ఇవన్నీ మనలో ఆధ్యాత్మికముగా నాలుగు స్థితులు.

## 16

కాలము సృష్టిలో సర్వమును నియమించును. సరియైన సమయములో సరియైన సంకల్పము లేక ప్రేరణ యిచ్చేటటువంటిది కాలమే. కర్మ బావుండకపోతే జీవులకు కాలము సరియైన ప్రేరణ యివ్వదు. దైవమునకు మాత్రమే కాలము లోబడి ఉంటుంది. కాలమునకు ఎంతటి వాడైనా పడిపోతాడు. కాలము ఎప్పుడు ఆకాశములో ఉంచుతుందో తెలియదు. ఎపుడు క్రింద పడేస్తుందో తెలియదు. పెద్దవాళ్ళము అనుకున్నవాళ్లను చిన్నవాళ్ళను చేస్తుంది. చిన్నవాళ్ళను పెద్దవాళ్లను చేస్తుంది. సృష్టిలో మొట్టమొదటా కాలమే, చివరా కాలమే ఉండేది. అందుకే కాలాన్ని మన పెద్దలు 'శేషుడు' అన్నారు.

## 17

నామస్మరణ చేసినా, పూజ చేసినా, ధ్యానము చేసినా మనలో ఒక తపనగా మారి జ్వాలగా వృద్ధి చెందాలి. దైవాన్ని ఏదో ఒక రకముగా రోజూ పట్టుకుంటూ ఉండి సాధన జరుగుతూ ఉంటే మనలో ఉన్న బలహీనతలు అన్నీ రాలిపోతాయి. దైవము గుర్తు లేకపోతే బలహీనతలకు బలము వస్తుంది. నిద్ర లేవలేక పోవడము, మాటయందు, తిండియందు నియమము లేకపోవడము, ప్రేయరుకు రాలేక పోవడము యివన్నీ బలహీనతలే. దైవము యొక్క అవసరము అందరికీ ఉంటుంది, అది కాదు ముఖ్యము. సహజముగా దైవము అంటే యిష్టము ఉన్నదా, లేదా అనేది ప్రశ్న. ఇష్టము ఉంటేనే భక్తి ఉన్నట్టు లెక్క. మిగిలిన విషయముల యందు కన్నా దైవము యందు జిగురు పెంచుకోవాలి.

## 18

భూ భారమును పోగొట్టుటకై నారాయణుడు తన తెల్లని వెంట్రుక నుండి బలరాముడుగాను, నల్లని వెంట్రుకనుండి శ్రీకృష్ణుడుగాను తానే అవతరించెను. అతని కేశములనగా అతని నుండి ప్రసరించిన కిరణములు. అందు రాత్రి రూపముగా చీకటిలో ప్రసరించిన కిరణము శ్రీకృష్ణుడుగా జన్మించెను. నల్లని కిరణమనగా అంతర్గతమైన అనుభూతికి సంబంధించినది. చీకటిలో ప్రసరించి, రహస్యముగా మన లోపల ప్రవేశించి కార్యక్రమములను నిర్వర్తించేవాడు శ్రీకృష్ణుడు. శ్రీకృష్ణుని వ్యూహం ఎవ్వరికీ అర్థము కాదు. కృష్ణుని స్పర్శలో చేరడానికే ఎవరైనా ప్రయత్నము చేయాలి. దానికి స్ఫూర్తినిచ్చేది భాగవతము.

## 19

శ్రీకృష్ణుడు ఎవరికీ పుత్రుడు కాదు. పుట్టినట్లుగా అనిపిస్తుంది. చతుర్భుజుడైన శ్రీకృష్ణుడు జైలు చూరు నుండి నేల వరకు వ్యాపించి దేవకి, వసుదేవులకు కనిపించి, పుట్టబోయే బిడ్డ మీద (రక్తమాంసాదులతో కూడిన శరీరంపై) తనను తాను ఆపాదించుకొని వసుదేవుడికి ఏమిచేయాలో చెప్తాడు. కృష్ణుని చుట్టూ ఒక అప్రాకృత శరీరము ఉంటుంది. అవసరాన్ని బట్టి చతుర్భుజుడై భూనభోంతరాళాల వరకు పెరగ గల ఆకారము అతనికి ఉన్నది. ఆ శరీరమే ప్రస్తుతము భూమిమీద జగద్గురు వ్యూహంగా పనిచేస్తున్నది. ఆ కృష్ణ శరీరంలోనే జగద్గురువుల మొత్తము పరంపరంతా వసించి ఉన్నది. ఆ స్పర్శ వలన వారు కార్యక్రమములు నిర్వహిస్తారు. వారిని అనుసరిస్తేనే మనకూ రక్ష!

## 20

''జీవులలో దేవుడున్నాడన్న భావన'' మనము భాగవతములో తెలుసుకోవలసిన ముఖ్యమైన విషయము. జీవులకు సేవ చేస్తాము కాబట్టి దేవుడికి పూజ చేయక్కరలేదు అనుకోవద్దు. దేవుడికి పూజచేస్తే జీవులకు సేవ చేయాలన్న స్ఫూర్తి వస్తుంది. లేకపోతే రాదు. దైవము యొక్క అనుగ్రహము మనయందు ఉంటుంది కాబట్టి ఆ అనుగ్రహాన్ని జీవుల సేవకని ఎక్కువగా నిర్వర్తించాలి. అలా నిర్వర్తించుకొంటేనే మనము పెరుగుతాము. తెలియకపోతే అహంకారములోకి పెరుగుతాము. తెలుసుకొని ఆచరిస్తున్నా, ఆచరిస్తున్నామన్న అహంకారము, ఎటుపోయినా అహంకారము దాటడము కష్టము. అహంకారమును ప్రతి నిత్యము కడుక్కోవాలంటే దైవ పూజ బాగా చేసుకోవాలి.

# 21

కష్టములో దేవుడిని తలుచుకోవడము ఒక అదృష్టము. కష్టములో కష్టమును తలుచుకోవడము ఒక దురదృష్టము. వారిలో భక్తి యింకినట్లు కాదు. ఎంత కష్టము వస్తే అంత లోతులలోకి వెళ్లి దైవములో ఉంటే పరిష్కారము తథ్యం. అది భగవంతుని మీద గాని, గురువు మీద గాని విశ్వాసం పరిపూర్ణముగా ఉన్నవారికే వీలు పడుతుంది.

## 22

రసము గ్రహించు దృష్టితో వినువారికి కృష్ణ కథలు పదము పదమునకు మధురమే. సందేహము లేదు. ఆయన యందు రుచి కలగాలే తప్ప, వారికి ప్రపంచములో ఇంకేమీ అక్కరలేదు. కృష్ణ కథ చెప్పమంటే సూతుడు భాగవతములో మొత్తము సృష్టికథ చెప్పాడు. 'అధరం మధురం, వదనం మధురం ......' మధురానుభూతి పుట్టింది మధురలో. ఆ మాధుర్యానుభూతి వలన బహుజన్మ పాపములు శమిస్తాయి. ప్రపంచములో యిపుడు ఉన్న పరిస్థితులు చాలా అన్యాయముగా, యిబ్బందికరంగా ఉన్నాయి. మనము ఏమి చేయాలంటే రోజూ రాత్రిపూట భాగవతము చదువుకోవడము అనే దీక్ష తీసుకోవాలి. కొన్ని పద్యాలు దైవము గూర్చి ప్రశంసించినవి నేర్చుకొంటే ఆత్మశాంతి నిస్తుంది. మంద్రజాలములో కృష్ణుడు ''నన్ను అనుసరించిన వారిని కలి తాకలేడు'' అని అన్నాడు. మైత్రేయుడు ''ఈ మార్గములో వెళ్లడము మనకు క్షేమము'' అన్నాడు.

## 23

భాగవతములో భాగవతుల కథలన్నీ గూడా కృష్ణుడి కథలే. కృష్ణుని యొక్క తత్త్వము ఆవిధముగా వారినుండి వ్యక్తమైనది. పరీక్షిత్తు రూపములో ఉన్నది గూడా కృష్ణుడే. పరీక్షిత్తు కథ చదువుకొనేవారికి చాలా రకములైన బంధములు తెగిపోతాయి. కలియుగ ప్రారంభములోనే కృతయుగము వచ్చినదన్నట్లుగా పరిపాలిస్తాడు. కలిపురుషుడికే భయము వేసినది. అక్కరలేని విషయములు మనము పట్టుకొన్నామని గూడా మనకు తెలియకుండా ఉంటే, మనలో కలి ప్రవేశించినట్లే. అలా బిజీ బిజీ గా కాలము గడిపేస్తూ ఉంటే, కాలము రూపములో యముడు వచ్చి, యింక మనము వెడదామా అంటాడు. అయ్యో, చాలా ఉండిపోయాయి సార్! అంటే కుదరదు. అందుకని భాగవతము చదువుకొంటే, యితర విషయముల యందు మనకున్న జిగురు తెలుస్తుంది.

# 24

100 మంది కౌరవులు, 5 గురు పాండవులు. మనలో చెడ్డభావాలు, మంచి భావాల నిష్పత్తి గూడా 100 : 5 గా ఉంటుంది. మంచి భావాలు పెరగాలంటే 'కృష్ణ అష్టోత్తరం' చదువుకోవాలి. అందులో ఆయనచే సంహరింపబడిన ఆసురీ భావములు గలవారు ఉన్నారు. పూతన, శకటాసురుడు మనలో ఉన్నారు. మనలో అసూయ వచ్చినదంటే దుర్యోధనుడు ఉన్నట్టు లెక్క. ద్వేషము వచ్చినదంటే మనలో కర్ణుడు ఉన్నాడని అర్థము. కుటిలమైన ఆలోచనలు వస్తే మనలో శకుని ఉన్నాడని, వీటిని వెంటనే పనులలో దింపేస్తే వచ్చే పిచ్చి భావాల రూపమే దుశ్శాసనుడు. ఆసురీ భావాలు పెరుగుతున్నకొద్దీ కళ తప్పి, రూపము వికృతముగా తయారవుతుంది. దివ్యమైన భావాలు ఏర్పడితే దివ్యకళ ఏర్పడుతుంది.

## 25

భ్రూమధ్యములో ఒక దివ్యమైన తెల్లని శ్వేతకమలము విచ్చుకున్నట్టుగా భావన చేసి దర్శనము చేయాలి. తెల్లని పద్మము యొక్క లక్షణము నిర్మలత్వము. అది సూర్యుని కాంతికి ఉన్ముఖమై ఉంటుంది. మనము శ్వేతపద్మమును భావన చేసుకొని భర్గోమండలమునకు వచ్చిన వెలుగు సవితృమండలమునకు, సవితృమండలమునకు వచ్చిన వెలుగు మనకు కనిపించే సూర్యమండలమునకు చేరి అక్కడ నుంచి వెలుగు, పద్మము మీద పడుతున్నట్టు భావన చేయాలి. శరీరములోని కణ కణములలోకి వెలుగును నింపుకోవాలి. ఏమీ చేయకుండా ఏమీ కాదు. నన్ను ఆలింగనము చేసుకొని, నా బుద్ధిని ప్రచోదనము చేసి నన్ను ఉద్ధరించు అని మాటిమాటికి ఆర్ద్రతతో కోరే మంత్రము 'గాయత్రి' మంత్రము.

## 26

శ్రీకృష్ణునికి ముఖ్యముగా ఎనిమిదిమంది భార్యలు. వారు మనలో అష్ట ప్రకృతులు. తరువాత వందమంది భార్యలు. వారు మనలో 100 నాడులుగా ఉంటారు. తరువాత 16,000 మంది భార్యలు. మనలో 16,000 ప్రజ్ఞలుగా ఉంటారు. ఈ 16,000 మంది భార్యలు గూడా కేవలము సంఘ శ్రేయస్సుని మనసులో పెట్టుకొని ఆయన వారికి భార్యలు అనే స్థానము కల్పిస్తాడే తప్ప, వారందరూ ఆయనకన్నా పెద్దవారు. ముసలివారు. అష్టప్రకృతులు, 100 నాడులు, 16 వేల ప్రజ్ఞలు కలిగినటువంటి మానవ శరీరములో దైవము ప్రవేశించడమే శ్రీకృష్ణుని అంతఃపుర ప్రవేశము.

## 27

విష్ణునికథలు వినడము, విష్ణువుకు చేసే ప్రశంస, విష్ణువుకు చేసే నమస్కారము, పాపము అనే కారుచీకటిలో ఎత్తుగా నిలుపబడి బాగా కాంతినిచ్చే దీపముల వంటివి. హృదయపొరలు మందముగా ఉండేవారికి ఆ కాంతి అందదు. విష్ణుని కథలు మిగతా వారిని ముట్టుకోకుండా ఉండవు. అది విష్ణుని గొప్పతనం. విష్ణువుని తలచుకోవాలి అని అనుకొనేవారికి భాగవత శ్రవణ కార్యక్రమము పెట్టుకొంటే తప్ప గుర్తుండడు. భాగవతము వినడము వలన ఇహమునకు, పరమునకు మేలు కలుగుట, కావలసిన సంపదలు సిద్ధించుట జరుగును.

## 28

ఋగ్వేదములో ఉన్నటువంటి 11,600 ఋక్కులలో 'పురుష సూక్తాన్ని' మించిన ఋక్కు లేదు. ఇది king of the sukthas. 'శ్రీసూక్తము' queen of the sukthas. పురుషసూక్తము చదువుతున్నప్పుడు నీలో యజ్ఞపురుషుడు చతుర్భుజుడుగా నిలబడినట్లు దర్శనము చేస్తున్నట్లుగా భావన చేయాలి. చదవడమంటే అది శాశ్వతముగా ఈ జన్మకు, పై జన్మకు మనలో నిలిచిపోవాలి. ఆ శబ్దతరంగముల యొక్క వైభవముచేత లోపల అంతఃకరణములన్నీ శుద్ధి చెందుతాయి. శుద్ధి చేసుకొన్న తరువాత లక్ష్మీదేవి వెలుగు వస్తుంది. మాస్టరుగారు ఈ రెండు సూక్తాలను పఠించుకోమన్నారంటే ఏదో ఒక రోజు గ్రుడ్డికన్ను తెరుచుకోకపోతుందా! అని అర్థము.

## 29

భాగవతము వింటూవుంటే అప్పటికప్పుడు స్ఫూర్తి వస్తుంది. వచ్చిన స్ఫూర్తి యిగిరిపోకుండా మనలో ఇమడాలంటే బాగా మననము చేసుకోవాలి. మననము చేసుకొంటేనే మనలో బాగా భక్తి స్థిరపడుతుంది. లేకపోతే పై పొర వలె ఉంటుంది. మనము మన ప్రవర్తనలో చక్కని మార్పు రావడము కోసము భాగవతము చదువుకుంటున్నాము. ప్రవర్తన దైవీ ప్రవర్తన అయినపుడు దైవీ అనుభూతి మనకు దక్కుతుంది. లేకపోతే భాగవతము మనకు తెలుసు అను భావన యందు జీవించడము ఉంటుంది.

## 30

బ్రాహ్మీ ముహూర్తము అంటే తెల్లవారు జామున 3 గంటల నుండి ఉంటుంది. దేవుడు, దేవతలు అందరూ మనము ఎవరమైనా లేస్తే అనుగ్రహిద్దామని available గా, రెడీ గా ఉంటారు. తెల్లవారకుండా వెళ్ళిపోతారుట! వాళ్లు వెళ్ళిపోయిన తరువాత మనము నిద్ర లేచామనుకోండి, ఏమీ ఉపయోగము లేదు. ప్రతి రోజు త్వరగా నిద్ర లేవడమనేది ఒక దివ్య కార్యము. ఒక దీక్షగా చేస్తే వెలుగు లోకాలలోకి ప్రవేశము ఉంటుంది.(ఆ సమయములో దైవీ ప్రజ్ఞలో ఉండాలి.) మొత్తం వారంలో ఆదివారము తెల్లవారుజాము సమయము అత్యంత పవిత్రము.

## 31

కాలము యొక్క ప్రభావమును నిరంతరము గుర్తుంచుకొన్నవారు జీవితమున సంయోగ, వియోగముల వలన పుటము పెట్టబడి, పవిత్రమై కొన్ని జన్మలకు జీవి ఈశ్వర సంగమ రుచి తెలుసుకొనును. చాలాసార్లు పడుతూ లేస్తూ ఉంటే, అలా కొన్ని లక్షల జన్మలు జరుగుతూ ఉంటే గాని జీవితము అంటే కేవలము తినడము, పడుకోవడము, డబ్బు సంపాదించడము కాదు అని తెలియును. చివరికి తాను మిగిలిపోయి, బాగుండేది ఒకటి ఉన్నది అన్న రుచి ఎవరికి తెలుస్తుందో వాడు నిజముగా భక్తి జనించినవాడు. అది పూసుకొంటే, రాసుకొంటే రాదు. ఆ భక్తి కలిగినవాడిని మనము పిలువనక్కరలేదు. వయసుతో సంబంధం లేదు. వాడంతట వాడే వచ్చేస్తూ ఉంటాడు. పీకితే రారుగా!

## 32

మంచి పని చెయ్యాలనే ఉద్దేశము మాత్రము ఉంటుంది గాని చెయ్యడానికి కావలిసిన ధైర్యము ఉండదు. ఒక మంచి పని మనలను రక్షిస్తుంది. జీవుడిగా మనము బాగుపడి, ఉద్ధరింపబడతాము అనే నమ్మకము ఉన్నవాడు దూకేస్తాడు. పరమగురువు గూడా అదే చెప్తాడు. "TO DARE, TO WILL, TO SERVE AND TO BE SILENT." ఎక్కువ చేసి ఏమీ మాట్లాడకపోవడము చెయ్యాలి. సంకల్పము ఉండి ధైర్యము లేక జీవించువారిపై ఆకస్మికంగా తోడేలు దుమికి జంతువును పట్టినట్లు అటువంటి వారిని కలి పట్టేస్తాడు. ఆచరణలోకి యింకా వీడు దిగలేదని. కలికి పట్టడము చాలా easy. పొరపాటు చేయువారి గురించే కలి వేచివుంటాడు.

## 33

కృష్ణ మార్గములో అప్పటికప్పుడు సంకల్పించడము, జరగడము తప్ప, ముందు తెలియదు. అదే అనుగ్రహము. మనము ఊహించినట్లుగా దైవము మన దగ్గరకు రావడమన్నది ఎవ్వరికీ ఏ రోజులలోను జరుగలేదు. ఊహించిన విధముగా జీవితమే నడవదు. ఊహించని విధముగా దైవము సాక్షాత్కరిస్తాడు కాబట్టి కళ్ళుపెట్టి చూస్తూ ఉండాలి. ఎటునుంచి వస్తాడో, ఎవరిని ఉద్ధరిస్తాడో, ఎవరిని పైకి లేపుతాడో, ఎవరిని క్రిందకు తోస్తాడో, కొన్ని వేల జన్మల పారము చూస్తేగాని తెలియదు. మనకుండే చిన్న బుర్రతో వేసుకునే లెక్కలు సత్యము కావు.

# 34

ప్రతి జీవికి లోపల నారాయణుడు ఉన్నాడు. త్రిమూర్తులున్నారు. త్రిశక్తు లున్నవి. సనక సనందనాది కుమారు లున్నారు. అష్ట దిక్పాలకులు, సప్త ఋషులు, నవగ్రహము లున్నవి. సమస్త సృష్టి ఏ విధముగా కోటానుకోట్ల దేవతాప్రజ్ఞలతో నిర్వర్తింప బడుతున్నదో అదేవిధముగా మానవ దేహ నిర్మాణములో గూడా అదే దేవతలు అవే కార్యక్రమములు నిర్వర్తిస్తూ ఉంటారు. అందుకే మానవుడు దైవానికి ప్రతీక అని చెప్తారు. ''దైవమును ఆధారము చేసుకొని సృష్టికర్త ఏవిధముగా నిర్వర్తించాడో, ఆ సూత్రాలను మనము పాటిస్తే సృష్టిలో బంధింపబడకుండా దివ్యత్వాన్ని పొందవచ్చు.'' ఇది భాగవత రహస్యము.

## 35

మన కర్తవ్యము మనకు తెలియాలంటే మనము తపస్సు చేయాలి. తపస్సంటే తపన. నేనెందుకు పుట్టాను? నేనేమి చేయాలి? అనే తపన. మనము ఎందుకు పుట్టామో మనకు తెలియాలి. మనము రోజూ దైవాన్ని "What I am to do?" అని అడగాలి. ఆ అడగడములో తపన ఉండాలి. ప్రధాన ప్రార్థన ఏమిటంటే "నేనేమి చేయడానికి పుట్టానో అదే నా చేత చేయించు" అని ఉండాలి. వచ్చిన పని కాకుండా ఇంకేదో చేస్తే ప్రయోజనము లేదు కదా! వచ్చిన పని తెలియుటకొరకే ప్రార్థనలు, పూజలు.

## 36

ప్రతి వారికి మూడు కర్మలుంటాయి. సంచితము, ప్రారబ్ధము మరియు ఆగామి. భక్తుల జీవితాలలో ముందు ఎక్కువగా వచ్చేది ప్రారబ్ధమే. ఒక ప్రక్క ఇది అయిపోతూ ఉండాలి. ప్రారబ్ధము ప్రస్తుతము అనుభవించేది. సంచితము నుంచి ఒక్కొక్క బస్తా మన ముందుకు వస్తూ ఉంటుంది. అది పిండి చేసేలోపు ఇంకొక బస్తా, అదయ్యే లోపు.... అది ఎంతుందో మనకు తెలియదు. ఈ సారి దిగివచ్చిన బస్తా వరకే పరిమితము చేసి, పాత బస్తాలన్నీ (సంచితము) దగ్ధము చేసే మార్గము ఒకటి ఉన్నది. అదే పరమగురువుల మార్గము (ప్రార్థన). Stock clear చేస్తారు. ప్రస్తుతము చేసే పనులలో అవకతవకల వలన ముందు పుట్టుకు వచ్చేది ఆగామి. ప్రార్థన బాగా చేయడము వలన ప్రారబ్ధమును సక్రమముగా నిర్వర్తించుకొనగల బలము వస్తుంది. సంచితము కరిగిపోయే అవకాశము ఉన్నది. ఆగామి ఎక్కువగా ఏర్పడకుండా ఉంటుంది.

## 37

శరీరమునకు మూడు మరణములు ఉంటాయి. శరీరమునకు ఒకటి, స్వభావానికి ఒకటి, అహంకారానికి ఒకటి. శరీరము మరణించినంత మాత్రమున స్వభావము మరణించదు. మళ్ళీ శరీరము ధరించి అదే స్వభావముతో అవే పనులు కొనసాగిస్తారు. స్వభావమును బట్టి శరీరము. భౌతిక శరీరము మరణించినపుడు సూక్ష్మ శరీరము, సూక్ష్మ శరీరము మరణించినపుడు కారణ శరీరము, కారణశరీరము కూడా మరణించినపుడు జీవుడిగా తనకు తాను ఉంటాడు. వీరే తామెవరో తాము తెలిసినవారు. ఇది తెలుసుకొనుటకు నిద్రలోకి ఎలా వెడుతున్నాము, నిద్ర నుంచి ఎలా బయటకు వస్తున్నాము అని గమనించాలి. ఇదే అద్భుతమైన సాధన. ప్రతిరోజూ temporary suspension ఉంటుంది.

## 38

గృహములలో నివసించు గృహస్థులైన మానవులు కొంచెమైనా ఆత్మవిచారణ చేయడము లేదు. రేయింబవళ్లు తాము కల్పించుకొన్న విషయములందే గడిచిపోవును. అలా యిరుక్కుపోయి ఉండగా తెలియకనే మృత్యువు వచ్చును. మనము ఏర్పరచుకున్నవే మన చుట్టూ పిశాచాల వలె తిరుగుతున్నాయి. వాటిని అలాగే తిరగనీ అనుకొని కాసేపు కళ్ళు మూసుకొని భగవంతుని ప్రార్థించాలి. ఏమి జరిగినా దైవప్రార్థన తగ్గకూడదు. అదే అన్నిటికీ పరిష్కారము. ఎన్ని యిబ్బందులు వస్తే అంత ప్రార్థన ఎక్కువ చేయాలి.

## 39

'ఓం' కారము పరబ్రహ్మ భావనకు విత్తనం వంటిది. ఓంకారమును ఒక్కసారి మనస్ఫూర్తిగా ఉచ్చరించినచో లోపలి లోకము లన్నియు పవిత్రీకరింప బడును. ఓంకారమును ఎంతగా ఆరాధిస్తే అంతగా ఏడు లోకాలకు దారి యిచ్చి, ఏడులోకాలను కలుపుతుంది. ఏడు లోకాల మధ్య నుంచి నిన్ను తీసుకొని వెడుతుంది. ఓంకారము చేయలేనిది లేదు. ప్రణవమంత్రమును స్మరించుటలో చాలా శ్రద్ధ కావలెను. యాంత్రికంగా చేయరాదు. ప్రణవాన్ని ఉచ్చరించిన తరువాత ఎంతసేపు ఉచ్చరించావో అంతసేపు విరామము యిచ్చి ఆ విరామములో మన లోపల జరుగుతున్న ప్రణవనాదము వినుటకు ప్రయత్నించాలి. అపుడు మనము అనకపోయినా అది వినబడుతుంది.

## 40

ఎదుటి వ్యక్తిలో ఉన్న సద్గుణములన్నీ విష్ణుని కళ్యాణగుణములు. అందుకే సద్గుణములనే పొగడాలి. విమర్శ మనకు సహజముగా ఉన్నది. విమర్శ ఉన్నచోట విష్ణువు ఉండడు. ఉండకూడనివి ఎదుటివారిలో ఉండవచ్చు. వాటిని మనము ముట్టుకుంటే మనకు అంటుకుంటాయి. దుర్గుణముల గురించి భావించినా, ఆలోచించినా మనలను ఆవహించేస్తాయి. ఇవన్నీ వినడానికి బాగానే ఉన్నాయి గాని, దైనందిన జీవితములో మర్చిపోతాము. సందేహము లేదు. ఇవన్నీ గుర్తు చేసుకుంటూ ఉంటే ఎప్పటికో పనికి వస్తాయి. ఇవన్నీ రేపటినుండి సాధ్యమా! నావల్ల కాదు అని అనుకోవద్దు. నేను పడిపోతాను, అయినా ప్రయత్నము చేస్తాను అనుకోవడము సాధన. ఏదైనా సాధన అంటూ చేస్తే 100 జన్మలు పట్టినా యిదే చేయడము better.

## 41

పుట్టి పెరుగుతున్న మానవునికి నేను ఈ పని చేయవలెను అని అనిపించును. కొంత కాలమునకు నేను ఈ పని చేయవలె ననిపించిన నాలోని ప్రజ్ఞాకేంద్రమెవరు? అని ఆలోచించును. అలా లోపల అనిపించడము రజస్సు లోనుంచి వస్తుంది. తమస్సు బాగా ఉన్నవారికి ఏది చేయ కూడదో అదే బాగా స్ఫురిస్తుంది. సత్వానికి సమపాళ్లలో ఉంటుంది. సత్వాని కన్నా పైన ఒక కేంద్రమున్నది. దానినే చైతన్యం, అమ్మవారు, గాయత్రి అంటాము. అక్కరలేదు, కావాలి అని గాకుండా యిది చెయ్యాల్సినది కనుక చేస్తాను అనేది సత్త్వములోంచి వస్తుంది. ఈ మూడు గుణములు దాటి ఏదైతే ఉన్నదో, అక్కడనుండి దిగి వచ్చినపుడు మనలో ఏ గుణము ఎక్కువగా ఉంటే ఆ గుణము రంగు అంటుకుంటుంది. ఆ గుణము రంగు అంటకుండా ఉండాలంటే గుణములు దాటినటువంటి వెలుగును గూర్చి ఆరాధన చేయవలెను. అందుకు గాయత్రి యిచ్చారు.

## 42

యజ్ఞార్థముగా కర్మలను ఆచరించుటయే యోగము. అవగాహన చేసుకొని ఆచరించిన సరియైన కర్మాచరణము వలన సరియైన జ్ఞానమబ్బును. జ్ఞానము బాగా పెరుగుతూ ఉంటే, సరైన కర్మాచరణము పెరుగుతూ ఉంటుంది. జన్మకు ఈ రెండునూ రెండు చేతులవంటివి. దేనితో ప్రారంభించిననూ రెండవది లభించి మొదటి దానికి సిద్ధి చేకూర్చును. ఇదియే సాంఖ్య యోగము. ప్రజ్ఞకేమో జ్ఞానము, దేహానికేమో కర్మ. ఈ రెండూ సమన్వయంగా సాగితే దేహానికి, ప్రజ్ఞకు ఒక చక్కని agreement ఏర్పడుతుంది. అపుడు ప్రజ్ఞ ఒకటి చెప్తే, దేహము ఒకటి చెప్పదు.

## 43

కపిలమహర్షి దేవహూతికి యిచ్చినటువంటి జ్ఞానాన్ని సాంఖ్యము అందురు. ఆ సాంఖ్యములో భక్తియొక్క లక్షణములన్నీ ఉంటాయి. భక్తి ఏ విధముగా ఉంటే అది సద్భక్తి అవుతుంది? అటుపైన జ్ఞానము. ఈ భక్తి, జ్ఞానముల ద్వారా జీవుడికి వైరాగ్యము కలగడము, భక్తి, జ్ఞాన, వైరాగ్యాల ఆధారముగా యోగాన్ని నిర్వర్తించుకోవడము ఉన్నది. ఒక విషయాన్ని నిష్ఠతో, దీక్షతో నిర్వర్తిస్తూ ఉంటే, క్రమముగా లోపల జీవ చైతన్యానికి వికాసం కలుగుతుంది. ఆ వికాసము కలగడము చేత ఒకదానిలో నుంచి మరియొక దానిలోకి వ్యాప్తి చెందుతాడు.

## 44

భాగవతములో మనోహరమైన పద్ధతిలో హరి లీలలుగా సృష్టిని వర్ణించడము ఉంటుంది. అందుచేత మనస్సు హరింపబడి మనకు ఒక ఉత్సవముగా అనిపిస్తుందని భాగవతములో ఉన్నది. ‘‘ఉత్తమ శ్లోక లీలోత్సవమున’’- ఉల్లాసము కలిగించేది ఉత్సవం. మన ప్రజ్ఞను కొంచెము మనోలోకాలలో నుంచి, అంతకన్నా వెలుగుతో కూడిన లోకాల్లోకి ఆకర్షించి, అక్కడి విషయములు తెలిపి, అక్కడ స్థిరపరచి, ఆహ్లాదం కలిగిస్తే అది ఉత్సవం. ‘‘గురుపూజ మహోత్సవం’’ అంటే అదే!

## 45

ప్రతి వారికి లోపల లింగ శరీరమని ఒకటి ఏర్పడుతుంది. అందులో నీ ఇష్టాలు, అయిష్టాలు, నీ అసంపూర్ణమైన కోరికలు, విషయాలు అన్నీ pack చేసి చిత్రముగా, గుప్తముగా చేరుతూ ఉంటాయి. దానిని ఎక్కడా దాచేయడానికి గాని, వదిలేయడానికి గాని వీలులేదు. అందుకని చిత్రగుప్తుడు అన్నారు. మన list మనతోనే ఉంటుంది. మళ్ళీ తిరిగి వస్తాము. మంచి వాటికి మంచి అనుభవించాలి. చెడు వాటికి చెడు అనుభవించాలి. వాటిని పూర్తి చేయడానికి వచ్చినపుడు పూర్తి అయ్యే లోపల క్రొత్తవి చేస్తూ ఉంటే అందులోనుంచి కొన్ని పుట్టుకొస్తాయి. ముందు పాత files clear చేసుకోవాలి. లేకపోతే తెమలడము ఉండదు. దీనికి విముక్తి ఏమిటంటే ''మన దగ్గరకు వచ్చిన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ, క్రొత్తవి మనము సంకల్పించి ఏమీ చేయకు'' అని కృష్ణుడు చెప్పాడు.

## 46

వశిష్ఠుడుకి శక్తి మహర్షి, శక్తికి పరాశరుడు, పరాశరుడికి వేదవ్యాసుడు, వేదవ్యాసుడికి శుకుడు- ఇది ఒక మహత్తరమైన వంశము. ఒకే వంశములో ఐదు తరాలలో ఐదుగురు గూడా అంతర్యామియే రూపు కట్టుకొని వచ్చినటువంటి వారు. ఒకే కుటుంబములో వెంటవెంటనే అంత పరంపర ఎక్కడా కనబడదు. వీరిని గురించి స్మరణ చేసుకొన్నంత మాత్రమున వాళ్ళందరూ మనము ఉండే చోటులో తిరుగుతూ ఉంటారు. మనము పిలిస్తే వారు అనుగ్రహిస్తారు. ''భగవద్భక్తుల ఆరాధన భగవంతుని ఆరాధనతో సమానమని'' భాగవతము చెప్తున్నది.

## 47

మహత్తరమైనటువంటి విషయములు ఒక మధురమైన భక్తి సాధనగా భాగవతము ఇస్తుంది. ప్రసన్నముగా ఉండి, చిరు దరహాసముతో ఉన్న భగవంతుని మూర్తిని చూస్తూ ఉంటే మనలో సత్త్వము పెరుగుతుంది. రజస్తమస్సులు పడిపోతాయి. మన స్వభావము నిండా చాలా రకాల కస్సులు, బుస్సులు, అసూయ- ఇవన్నీ ఈ ఆరాధనా మార్గములోనే విసర్జింపబడతాయి. అపుడు వెలుగు లోకాలలోకి ప్రవేశించి విష్ణుపదమును చేరుకోవచ్చు. విష్ణుపదము మనకు ఫాలభాగములో ఉంటుంది. భగవంతుని పాదములు మన సహస్రారములో ఉంటాయి. ఆయనకు పైనుంచి క్రిందకు ౭వ లోకము. మనకు క్రిందనుంచి పైకి ౭వ లోకము. అక్కడ మనకు పాద స్పర్శ దొరుకుతుంది. అందుకనే విష్ణుపదము చేరారు అంటారు. విష్ణుపదానికి దగ్గరే ఉంటాడు విష్ణువు.

## 48

మనలో భయము, ఉద్వేగము, కోపము, ఈర్ష్య, అసూయ, బాగా రాగము, బాగా ద్వేషము ఉండేటప్పుడు వాయువు (శ్వాస) అడ్డగోలుగా పీల్చబడి, వదలబడుతూ ఉంటుంది. దానివల్ల శరీర ఆరోగ్యము పాడుచేసుకున్నట్లే అవుతుంది. అందుకని ప్రాణాయామము అన్నారు. లోపలికి వెళ్లే శ్వాస మీద, బయటకు వచ్చే శ్వాస మీద మనసు లగ్నము చేసినపుడు వాయువు సమము అవుతుంది. ప్రాణము శ్వాసరూపములో ఉంటుంది కాబట్టి, శ్వాస యమింపబడి వారికి ఆహ్లాదము సహజంగా ఉంటుంది. నీవు వాయు రూపములోకి వచ్చేస్తావు. వాయువు అనాహతము. అంటే 4వ కేంద్రము. అలాగే మనిషి 4వ వాడు. ఖనిజము, వృక్షము, జంతువు, మానవుడు. పంచ భూతాలలో నాలుగవది వాయువు. అష్టాంగాలలో నాలుగ వది ప్రాణాయామము.

## 49

ఒక ఉచ్ఛ్వాస అయిపోయి నిశ్వాసగా మారే లోపు, నిశ్వాస అయిపోయి ఉచ్ఛ్వాసగా మారే లోపు సంధి ఉంటుంది. ఆ సంధిలో ఆరాధన ఉంటుంది. ప్రొద్దున చీకటి వెలుగుగా మారేటప్పుడు, సాయంత్రము వెలుగు చీకటిగా మారేటప్పుడు సంధికాలము ఉంటుంది. అపుడు చేసేది సంధ్యావందనం. మనకు కూడా తెలివి లోంచి నిద్రలోకి వెళ్ళేటప్పుడు, మళ్లీ నిద్రలోంచి తెలివిలోకి వచ్చినపుడు ఆరాధన ఉంటుంది. గాలి పీల్చి వదిలేటప్పుడు, మళ్ళీ పీల్చేటప్పుడు ఆరాధన ఉంటుంది కాబట్టే కుంభకము, రేచకము అంటారు. అది భాగవత మార్గములో సహజముగా జరుగుతుంది.

## 50

మానవులము అగుటచే మనము మనోలోకములోనే ఎక్కువగా ఉంటాము. మనోలోకములో ఉండుటచే పరిసరాలను గూర్చిన భావనలు, విషయములు, సమస్యలు మనస్సులో తిరుగుతూ ఉంటాయి. దీనికి ఒక మార్గము ఉన్నది. మనలో జరుగుతున్న శ్వాసను మనస్సుతో గమనిస్తూ, మనస్సును వాయువుతో అనుసంధానము చేస్తే (ఎక్కడవరకు శ్వాస వెడుతున్నది, తిరిగి బయటకు ఎక్కడినుంచి వస్తున్నది) క్రమముగా మనము వాయుపుత్రు లవడానికి వీలవుతుంది. వాయువు ఆరాధనే హనుమంతుని ఆరాధనగా చెప్తారు. హనుమంతుడిని పెట్టుకొని వాయువుని మరచిపోతే కథే లేదు. శ్వాసను గమనిస్తూ ఉంటే మనస్సు సంకల్పమాత్రము చేత హృదయములో నిలుస్తుంది.

## 51

ఈ జన్మలో ఏదన్నా కొంచెము బ్రతికి బయట పడాలంటే శ్వాసను పట్టుకోవడమే మార్గము. వాయువును పట్టుకుంటే మనస్సు చెప్పిన మాట వింటుంది. లేకపోతే వినదు. చెప్పిన మాట వినని మనస్సుతో ఏం చేయించ గలము. మనస్సుకు ఒక లాజిక్ ఉన్నది. చేయగూడనివి ఎందుకు చేయాలో చెప్తుంది. చేయవల్సినవి ఎందుకు చేయకూడదో చెప్తుంది. దానికి శిక్షణ యివ్వడమంటే రోజుకు 3 సార్లు- 24 or 48 or 72 నిమిషాలు చొప్పున శ్వాస మీద ధ్యాస పెట్టవలెనని మాస్టర్ జ్వాల్‌కూల్ గారు చెప్పారు. ఈవిషయము మన భారతీయ వాఙ్మయములో చాలా చోట్ల చెప్పారు గాని, ఇంకా యేవో మహత్తరమైన విషయములు తెలుసుకుందామనే భావనతో సులభమైన విషయాన్ని ప్రక్కకు పెట్టేయడము జరుగుతున్నది.

## 52

యముడనగా అధర్మము నుండి ధర్మమార్గమునకు నియమించునట్టి నిర్మల ధర్మ స్వరూపుడు. మనము చేసే వాటిలోంచి మనకొచ్చే ఫలితాలు తెచ్చి, ఇదిగో యివి నీవే అని అందిస్తాడు. ఇది పక్కింటికేమో అంటే కాదు నీదే అంటాడు. ఇంట్లో నలుగురు ఉన్నా నీచేతికే అందిస్తాడు. వాళ్ళ దగ్గర నుంచే కర్మ ఉత్పన్నమైనది కాబట్టి మళ్లీ ఆ ఫలితము వారినే చేరుతుంది. Same to you. అలా సృష్టి ధర్మము ఉన్నది. ఎవరెవరు ఏయే కర్మలు చేసుకుంటే ఆయా ఫలితాలు ఆ చక్రములో తిరిగి తిరిగి మరల వాళ్ళ దగ్గరకే వచ్చేస్తాయి. నువ్వు దైవీ కార్యక్రమములు చేసుకుంటే దేవతలు, దైవీ విభూతులు దానికి సంబంధించిన వారి సన్నిధిలో ఉంటావు.

## 53

ధారణ మన మనసులో బాగా జరగాలంటే ఒక తంత్రము యిచ్చారు. ఒకే సమయములో దైవ ప్రార్థన చేయడము వలన కాలము యొక్క సహకారం లభించి సులభముగా సిద్ధిస్తుంది. మనము అనుకున్న సమయాన్ని మనము అనుసరించాలి. ఒకే సమయములో రోజూ ఇతను కూర్చుంటాడని తెలిసి సిద్ధులు, చారణులు, ఋషులు, మహాత్ములు సంచారము చేస్తూ మనలను అనుగ్రహిస్తారు. ఒకే సమయములో ఒకే చోటుకు వెళ్లే ప్రజ్ఞలు ఉంటాయి. మనము రోజుకు ఒక్కొక్క time అనుకుంటే దేవతా ప్రజ్ఞలు మన గురించి ఆగవు. ''ఒకే సమయమునకు చేయడము'' ఒక నియమము. దీనినే కాలచక్ర తంత్రమని అంటారు. అది తంత్రాలలో కెల్లా పెద్ద తంత్రము. తంత్రానికి మొత్తము భూగోళములో మూలమైన కేంద్రము నీలగిరులు. మన మాస్టరుగారు నీలగిరులలో నుంచి దిగివచ్చిన అగస్త్య ప్రజ్ఞ కాబట్టి మనకు యిందులో జోడించి యిచ్చారు.

## 54

ఓంకారము పరిపూర్ణము. స్ఫూర్తితో ఓంకారము ఉచ్చరిస్తే మన లోపల ఉన్నటువంటి ఏడు లోకాలు పవిత్రీకరణ చెందుతాయి. మనోలోకము, కామలోకము, భౌతికలోకము మొదలగు లోకాలన్నింటికి ఒకసారి ఓంకారముతో స్నానము చేయించినట్లే. ఓంకారము ఉచ్చరించబోయే ముందు తాను కూర్చుండి, తన చుట్టూ సమబాహు త్రిభుజమును స్మరింపవలెను. త్రిభుజము అంటే అన్ని కోణములు సమానముగా ఉండాలి. సృష్టి మొత్తము త్రిగుణముల చేతనే ఏర్పడును. ఆ త్రిభుజము లోపల ఒక వృత్తము. ఆ వృత్తము సృష్టి లోపలి దైవము. ఆ వృత్తము లోపల నీవు. అలా భావించుకొని ఓంకారమును ఉచ్చరిస్తే అది మనలను అనుగ్రహిస్తుంది. 'బ్రహ్మమే ఓంకార స్వరూపము' గనుక ఆ విత్తనం విచ్చుకోవడము మొదలుపెడుతుంది.

## 55

ప్రపంచానికి ఏమి చేయడానికి సంసిద్ధత లేనివారిని, జీవులకి ఏ సేవా చేయడానికి సంసిద్ధత లేనివారిని దైవము ఒప్పుకోడు. ఏమి చేశావు అన్నది లెక్క. దైవముతో సంబంధము మనకి జీవుల సేవతో వస్తుంది తప్ప, పాండిత్యముతో రాదు. ఈ తెలివి యందు స్థిరపడినవారు మాత్రమే నారాయణుని యందు నిలబడుదురు. నడుమ ఇతర లోకములలో నిలిచిపోవు వారు ఆయా లోకముల యందు బద్ధులై కల్పాంతము వరకు వేచి ఉండవలసిన దుస్థితి పడుతుంది. కారణమేమనగా భౌతిక శరీరము ఒక్కటే ఉత్తమ సాధనకు పనికి వచ్చు విద్యాలయము. ఇది విడిచిన తరువాత మరల దేహము ధరించువరకు ఎట్టి సాధనయు జరగదు. ఈ వాక్యములు మనలో స్థిరపడాలి.

## 56

పరీక్షిత్తు మహారాజు శ్రీకృష్ణుని చాలా ఆరాధన చేస్తాడు. శ్రీకృష్ణుడు ఒక వరము యిస్తాడు. "నిన్ను చూచిన వారందరికీ నీ కళ్ళలో నేను కనిపిస్తాను" అని శ్రీకృష్ణుడు అంటాడు. అందుకని పరీక్షిత్తుని చూచిన వారందరికీ కృష్ణుడిని చూసినట్లుగానే ఉంటుంది. కలి పురుషుడు గూడా ఓరి బాబోయ్! కృష్ణుడు వెళ్లిపోయాడనుకున్నానే, యిక్కడే ఉన్నాడా అని పరీక్షిత్తుని చూచి అనుకుంటాడు. దానికి కారణమేమిటంటే పరీక్షిత్తు ఎప్పుడూ అన్నివేళలా అన్నిటియందు పరీక్షగా కృష్ణుడినే చూస్తూ ఉండడము చేత పరీక్షిత్తుకు కృష్ణ రూపము వచ్చేసింది. దీనినే సారూప్యము అంటారు.

## 57

ధారణ సిద్ధించుటయే యోగికి దేహము విడుచుట. ధారణ అనగా మనస్సు కరిగి బుద్ధిలోకములో ఉండుట. బుద్ధి లోకమనగా జీవుని యొక్క వెలుగు. దేహము అంటే మనస్సు, ఇంద్రియములు, శరీరము. ప్రాణము ఆధారంగా జీవుడు ఈ మూడింటితోను ముడి పెట్టుకుంటాడు. దైవముతో మమేకము కాకుండా దేహముతో మమేకము అగుటవలన శరీరము నుండి ప్రాణము నిష్క్రమించే సమయానికి దానిలోనుంచి పీకాల్సి వస్తుంది. ఆ పీకుడే యమపాశము. ఇంకా చేయవలసిన పనులపై భ్రాంతి, సంపాదన గూర్చి, ఆస్తిపాస్తుల గూర్చిన భావనలతోనే జీవితము గడిచిపోతుంది. ఈ చిక్కు తొలగాలంటే ఆరాధన బాగా పెరగాలి. 1. ఆరాధన మార్గము. 2. యోగ మార్గము. మొదటిది మధుర మార్గము మరియు భాగవత మార్గము.

## 58

సదాచార సంపన్నుడైన శిష్యుడు తనకు సద్గురువు యిచ్చిన యోగాన్ని శ్రద్ధతోను, భక్తితోను, విధివిధానముగా నిర్వర్తిస్తూ ఉంటే శిష్యుడు బాగా నిష్ణాతుడని, వెలుగు తేగలడని దృఢ నమ్మకము కలిగితే సద్గురువు నుండి బ్రహ్మచైతన్యము శిష్యునికి చాలా నిశ్శబ్దముగా ప్రవహిస్తుంది. అలా ప్రవహించడము చేత ఆ శిష్యుని స్వభావములోని వర్జనీయమైన విషయాలన్నీ విసర్జింపబడి శిష్యుడు చక్కగా తీర్చిదిద్దబడతాడు.

## 59

భాగవత కథలు వింటూ ఉంటే, మనసుకు అక్కరలేని విషయముల సంగము వదిలి దైవము యొక్క సంగము ఏర్పడుతుంది. శ్రద్ధగా వింటే దోషములన్నియు తొలగిపోతాయి. ఎక్కడ భాగవతము, రామాయణము వంటి గ్రంథములు పఠింపబడడము జరుగుతూ ఉంటుందో ఆ ప్రదేశమంతా భగవతత్త్వముతో నిండిపోయి ఉంటుంది. పొరపాటున మనకు తెలియక మంచి అనుకొని చెడుని బాగా ఆలింగనము చేసుకుంటాము. అటువంటి సంగమము లేమన్నాఉంటే దైవమే కలవకుండా ఒక ఏర్పాటు చేసి, తప్పించేస్తాడు. నీకు ప్రాణస్పందన యిస్తున్నటువంటి వాడికి సమర్పణ చేసుకొని జీవిస్తూ ఉండడమే శరణ్యము.

## 60

రామాయణము ఏమి చెప్తున్నదంటే ''మొదటి పలకరింపు నీదిగా ఉంటే'' అది ఉత్తమ సంస్కారం అని చెప్తుంది. వాళ్ళు పలకరించిన తరువాత మనము పలకరించడము మంచి సంస్కారం కాదు. అహంకారము బాగా ఉన్నప్పుడు మనల్ని అందరూ వచ్చి పలకరించాలని ఉంటుంది. ఎదుటివారిలో దైవాన్ని చూసి పలకరించడము మన సంస్కారం. అలా చూసిన వాడికి భక్తి. మనము వాత్సల్యము చూపిస్తే మనకు వాత్సల్యము వస్తుంది. మరొకటి చూపిస్తే మరొకటి వస్తుంది. Happy new year అంటే same to you అంటాడు. మళ్లీ extra ఎందుకని. నీవు నాకేమి చెప్పావో ఈ సంవత్సరమంతా అదే నీకు జరుగుగాక అని. మనము సత్కార్యాలు చేస్తూ, సద్భావము కలిగి, అందరిలో దైవాన్ని చూస్తూ ఉంటే అందరిలోంచి దైవమే నీతో వాత్సల్యపూరితముగా ప్రవర్తిస్తాడు.

## 61

మనకు భగవంతుని నామములు ఎక్కువగా ద్వయాక్షరాలే యిచ్చారు ( శివ, విష్ణు, రామ, కృష్ణ ). ఎందుకంటే మనకు లోపల ఒక ద్వయ శబ్దము జరుగుతూ ఉంటుంది. ఆ ద్వయశబ్దాన్నే హంసశబ్దము అని అంటారు. 'సోహం' అని వింటారు. శ్వాస పీల్చేటప్పుడు ఒక అక్షరము, విడిచేటప్పుడు ఒక అక్షరము భావన చేసినపుడు మన ప్రజ్ఞ ప్రాణముతో ముడిపడిపోయి ఉంటుంది. స్పందనములో విడుచుకోవడము, ముడుచుకోవడము జరుగుతూ ఉంటుంది. శబ్దము యొక్క తరంగములు స్పందనలో ప్రవేశించి ప్రజ్ఞను, ప్రాణమును ఏకకాలములో శుద్ధి చేస్తాయి. శుద్ధి అవడానికి మన ఋషులు ద్వయాక్షరి మంత్రములను యిచ్చారు.

## 62

పంచభూతాత్మకమైన సృష్టిలో దిగబడిన జీవుడికి అంతా రొచ్చే. ఇది ఒక దావానలము. అందుకని రోజూ పనిచేస్తున్నప్పుడు హరినామ స్మరణ అనే safety equipment తో పని పూర్తిచేసుకోవాలి. ఈ దావాగ్ని నుండి భాగవతము మనలను రక్షిస్తుంది. అందుకని శౌనకాది మునులు సూతుడిని కృష్ణకథలు ఎంత కాలము చెప్పినా తనివితీరదు, ఇంక చాలులే అని మాకు ఎప్పటికీ అనిపించదు, కృష్ణ కథలే వినిపించండి అని అడుగుతారు. కృష్ణ కథలలోని మాధుర్యము అటువంటిది. వింటున్నకొద్దీ ఆనందము, అనుభూతి కలుగుతుంది. మనకు తెలియ కుండానే మన మనసును తేలిక పరచేటటువంటి ఒక స్పర్శ కృష్ణ స్మరణలో ఉన్నది.

## 63

అంతర్యామి భగవంతుని చైతన్యము నుండి త్రిశక్తులుగా త్రిమూర్తులు వెలువడి సృష్టి నిర్మాణము చేయగా, ఆ సృష్టి నిర్మాణములో రుద్రులు, ఆదిత్యులు, వసువుల రూపములలో దైవమే ఆయా కర్తవ్యములను నిర్వర్తించి అటుపైన పంచేంద్రియములను, కర్మేంద్రియములను, పంచతన్మాత్రములను, పంచభూతములను ఏర్పరచి తద్వారా సృష్టియందు పురములను (శరీరములను) ఏర్పాటు చేసి ఆ పురములందు దైవము ప్రవేశించాడు. ఉన్నది ఆయనే. కాని ఎవరికి వారు తాముగా ఉన్నామనుకుంటారు. ఉన్నది సముద్రమే. అలగా లేచినపుడు తాను అల అనుకున్నా అది కేవలం పరిమితమైన భావన. సముద్రము లేకుంటే అల లేదు. అల యందు పూర్ణముగా ఉన్నటువంటిది సముద్రము. అల సృష్టించే నురుగు ఉన్నదే అది బొత్తిగా అశాశ్వతము.

## 64

మనము కర్మసిద్ధాంతము తెలియకుండా కర్మలజోలికి పోతూ ఉంటాము. తెలిసో తెలియకో, ఆశపడో, అహంకరించో ఏదో చేయబట్టే మనము చేసినది ఒక ప్రక్క నుంచి బంధించుకుంటూ వస్తుంది. మనకు తెలియదు దేనివల్ల బంధింపబడ్డామో! ఇప్పుడు బాగాలేదు కాబట్టి మరల అవే పనులు చేస్తుంటే మాత్రము కుదరదు. ఎప్పటికైనా విధానము మారాలి. పశ్చాత్తాపము కలగాలి. పశ్చాత్తాపము కలిగి భగవంతుని ఆరాధన చేస్తే భగవంతుడు అనుగ్రహిస్తే మార్పు వస్తుంది. అపుడు దివ్య కర్మఅనేదానిలో చేరినవారు ఏమీ ఆశించకుండా కర్తవ్యము మాత్రమే నిర్వర్తిస్తారు. లేకపోతే ప్రకృతి సిద్ధమైన చట్రము నుంచి తప్పించుకోలేరు. ఎవరికి వారు ఆత్మపరిశీలనము, ఆత్మావలోకనము చేసుకోవాలి.

## 65

దైవమును గూర్చి వినడములో, ఆయన యొక్క స్వరూప స్వభావాలు తెలుసుకోవడములో, లీలాప్రాయముగా సృష్టి యందు ఏ విధముగా చరిస్తాడో తెలుసుకొనడము వలన జీవుడు పునీతుడవుతూ ఉంటాడు. ఇది తెలియనటువంటి భక్తిని మూఢభక్తి అంటారు. అలాంటి భక్తి వలన ఉపయోగము లేదు. ఈ భక్తికి వికాసము కలగాలంటే జ్ఞానము కావాలి. అందుచేత భక్తి, జ్ఞానము అనే రెండు రెక్కలను బలంగా మనము ఏర్పాటు చేసుకుంటే అపుడు వైరాగ్యమనే ఊపు చేత ఆకాశములోకి ఏ విధముగా పక్షి ఎగురుతుందో ఆ విధముగా మనము ఊర్ధ్వలోకాలలోకి ప్రవేశము చేస్తాము.

## 66

భారతీయ వాఙ్మయములో శబ్దానికి చాలా ఉత్కృష్టమైన స్థానము ఉన్నది. ఆకాశము యొక్క గుణము శబ్దము. సుశబ్దంబులు పలుకుతూ ఉంటే మనలో ఉన్న పంచభూతములలో అత్యుత్తమ మైనటువంటి ఆకాశము నిర్మలమవుతూ ఉంటుంది. సుశబ్దంబులు పలికిన నాలుకతో అపశబ్దంబులు పలుకుతూ ఉంటే-శుభ్రముగా కడుగుకొని, ముగ్గులతో అలంకరించుకొని ఆ తరువాత అక్కడే మలినములు వేసినట్లుగా ఉంటుంది. పరమగురువులు ప్రస్తుతకాలములో సుశబ్దములతో మంచి తరంగములు భూగోళమంతా వ్యాప్తిచేయడము కోసము ఓంకారము, గాయత్రి యిత్యాది మంత్రములను వ్యాప్తము చేస్తున్నారు. ఏది పరిశుభ్రము చేసుకుంటే మిగిలిన పంచ భూతములు అన్నీ పరిశుభ్రము అయిపోతాయో అది మనలో శబ్దోచ్చారణగా పనిచేస్తూ ఉంటుంది. శబ్దోచ్చారణ విషయములో మనిషికి చాలా బాధ్యత ఉన్నది. ఇది ప్రధానమైన కార్యక్రమము.

## 67

భగవదనురక్తి ఉత్తమ సంస్కారం. మానవుడు సంస్కరింప బడుచున్నకొలది, పవిత్రత చెందుచున్నకొలది దైవపరమైన విషయముల యందు అనురక్తిని పొందు చుండును. అట్టివారి జీవనమే వైభవము. ఇతర వైభవములు మెఱపుల వంటివి. భగవదనురక్తి కలగవలెనన్నచో భాగవతజనుల సహవాస సల్లాపాదులే ముఖ్యమార్గము. భక్తి సాధన నిలబెట్టుకొనవలెనన్నచో కూడా ఇది ఒక్కటే మార్గము.

# 68

మత్స్యావతార ప్రాశస్త్యం ఏమిటంటే ఏ జీవికి అయినా సరే తాను మరణించిన తరువాత తనకుండే సమస్త జ్ఞానము మరణముతో మరపు వచ్చేస్తుంది. అంతకుముందు అద్భుతమైన సృష్టి చేసిన చతుర్ముఖ బ్రహ్మ మళ్లీ సృష్టి చెయ్యాలంటే ఎట్లా అని ఒక స్థితిలోకి వచ్చాడు. మనకు అంతకుముందు ఏ ఏ దేవతా ప్రజ్ఞలు, ఋషిప్రజ్ఞలు మేల్కొని ఉన్నాయో అవి మళ్లీ మేల్కొనేలాగా చేసేవాడు మత్స్యావతారమూర్తి, సద్గురువు మూర్తి. ఏది తనను ముందుకు తీసుకొని వెడుతుందో, ఏదైతే తనను కడతేరుస్తుందో ఆ విద్యను మళ్ళీ మనకు గుర్తుచేయడానికి మత్స్యావతారంగా దిగివస్తాడు. మత్స్యమూర్తిని ఆరాధన చేసుకోవడము అత్యవసరము. మాస్టరు గారు వ్రాసిన భాగవత గ్రంథము అట్టమీద మాస్టరుగారు కోరి మత్స్యావతార చిత్రమును అందించారు.

## 69

మన జీవన కార్యక్రమములో మనము ఒక వరదలా కొట్టుకుపోతూ ఉంటాము. అలా కొట్టుకుపోకుండా ఉండాలంటే, మన హృదయము నందు ఒకసారి సద్గురుమూర్తిని తలచుకొని ఒక పది పేజీలు భాగవతము లేక ఒక పది భాగవత పద్యాలు చదువుకొని నిద్రపోవాలి. ప్రతిరోజు చిట్టచివరి కార్యక్రమముగా భాగవతమును కనీసము ఒక సంవత్సరంపాటు నిష్ఠగా, దీక్షగా చదువుకుంటే చాలు. మనలో చాలా మార్పులు వస్తాయి. భాగవతాన్ని చాలామంది వ్రాశారు. కవి దృష్టితో, భాషాజ్ఞాన దృష్టితో వ్రాయడము వేరు. ఋషి దృష్టితో వ్రాయడము వేరు. మనలోనే మన కథ మనకు చెప్పే మాస్టరు గారి భాగవతమును చదువుకుంటే తరింపు తథ్యము.

## 70

మానసిక కక్ష్యలో ప్రధానముగా పడి ఉండే జీవుడు తన లోపల ఉండే వాయువుతో అనుసంధానము చేసుకోవాలి. పని ఉన్నప్పుడు పనిచేసుకొని, పని లేనప్పుడు మనస్సును తీసుకొని శ్వాస మీద పెట్టాలి. శ్వాస ఆధారముగా సమానవాయువు లోనికి అనగా స్పందన లోనికి, సూక్ష్మ స్పందన లోనికి (హృదయము) అక్కడ నుండి ఉదానవాయువు ద్వారా కంఠము, అటుపైన భ్రూమధ్యము చేరి (వ్యానవాయువు) ఆజ్ఞ నుంచి బయటకు రావడము జరుగుతుంది. ఈ కార్యక్రమమును 'అనిలాగ్ని ధారణము' అంటారు.

## 71

భాగవతము పఠించేవారికి భగవంతుడు హంస స్వరూపుడై హృదయములోకి దిగివస్తాడు. స్పందననే భగవంతునిగా భావన చేసినచో భక్తియోగము పుట్టును. దానివలన భాగవత మనబడు ప్రణవతత్త్వము సర్వాంతర్యామిగా దర్శనమిచ్చును. ఓంకారము వినబడేది. అనబడేదికాదు. ఓంకారము ఏది ఆధారంగా వస్తుంది అనేది భావన చేయాలి. ఓంకారమునకు ఆధారము నిశ్వాస. నిశ్వాసకు ఆధారము ఉచ్ఛ్వాస. దైవము ఉచ్ఛ్వాస నిశ్వాసలకు ఆధారము కాబట్టి దైవమును దర్శనము చేసుకుంటూ ఓంకారము చేయాలి. అలా పలకబడేది ఓంకారము. జీవుడు తల్లి గర్భమునుండి భూమిపైకి వచ్చినప్పటినుండి అంతర్యామిగా ఈ హంసావతారమే పనిచేయును.

## 72

మనలో దైవము నాలుగు రకములుగా ఉంటాడు. మనలో దైవము ఉన్నాడని మనకు గుర్తు లేదనుకోండి. దైవము నిద్రపోతూ ఉంటాడు. దైవమున్నాడని అపుడపుడు గుర్తుకు వచ్చిందనుకోండి. మనలో దైవము అపుడపుడు కాళ్లు, చేతులు ఆడిస్తుంటాడు. దైవమున్నాడని ఎక్కువగా గుర్తుకొస్తుంటే మనలో దైవము హనుమంతుడిలాగా ఆనందముతో చిందులు వేస్తాడు. దైవమున్నాడని ఎల్లప్పుడు గుర్తుంటే అపుడు జరిగేది ఏమిటంటే మనలో 16 సంవత్సరముల యువకుడి లాగా షోడశ కళలతో పూర్ణముగా ఉంటాడు. అపుడు అంతులేని మహిమ ఉంటుంది. మైత్రేయ మహర్షి ఈ విధముగానే ధ్యానము చేస్తారు.

## 73

కృష్ణుడు అనగానే అంతర్యామి దైవమని భావన చేయాలి. లేకపోతే కృష్ణుని బొమ్మ చూస్తేనే కృష్ణుడు గుర్తుకు రావడము ఉంటుంది. అంతర్యామినే రకరకములుగా సంబోధిస్తారు. జీవుడు ఏ రకమైన ప్రవర్తన చేస్తున్నా మనవరకు అంతర్యామి దైవముతో సంబంధము ఏర్పరుచుకుంటే అంతర్యామి నీ యందు అవతరిస్తాడు. అతను అవతరించి మన ద్వారా అన్ని పనులు నిర్వర్తిస్తాడు. అంతర్యామి మన ద్వారానే మాట్లాడతాడు. స్పర్శనిస్తాడు. చూస్తాడు. మన ప్రజ్ఞ అంతర్యామి యందు ఉంటే చిన్న సమస్య వచ్చినా మనలో అలజడి అంతగా ఉండదు. అందరిలోనూ దైవమును చూసే వికాసము ఏర్పడుతుంది.

## 74

మన పెద్దలు దానము చేయడము ఒక అలవాటు కావాలి అని చెప్పారు. చాణుక్యుడు 15 శాతం మనకున్న దానిలో దానము చేయమన్నాడు. ఆదాయము లక్ష అయితే 15 వేలు దానము చేయాలి. ఎక్కువ అనిపిస్తే కనీసము 5 శాతం. ఏమీ యివ్వకుండా దాచుకుంటే దాచుకున్నదంతా చుట్టేస్తుంది. దానము చేస్తున్నకొద్దీ సుఖము పెరుగుతుంది. మన బిడ్డలు మనలను హింసిస్తుంటే మనము దానము చేయలేదని అర్థము. ఇపుడు చేస్తే వచ్చేజన్మకు బావుంటుంది. దానము చేస్తేనే మంచి సంతతి ఉంటుంది (కౌరవుల లాటి వారు కాకుండా). దానము చేయడము వలన కొంత కర్మ క్షాళన మవుతుంది. దానము ఒక్కటి చాలు భగవంతుని చేరడానికి.

## 75

భగవంతుని గురించి ప్రవచనము జరుగుతున్న చోట మునులుంటారు, ఋషులుంటారు, భగవంతుడుంటాడు, భగవద్భక్తులుంటారు. కాబట్టి మనకు ప్రశాంతత కలుగుతుంది. అది ఎక్కువ సమయము ఉండాలంటే ప్రతి రాత్రి పడుకొనేముందు ఒక అరగంటైనా భాగవతము చదువుకొని ఆ ప్రజ్ఞతో నిద్రలోకి వెడితే అలాంటి ప్రజ్ఞతోనే మళ్లీ ప్రొద్దున మెలకువ వస్తుంది. తత్త్వము గురించిన పద్యాలు మనము బాగా చదువుకుంటే భగవంతుని యొక్క అవతరణము బాగా జరిగి మనలో ఉండే దేవతా ప్రజ్ఞలన్నీ బాగా ప్రచోదనము చెంది మనకు సహకరిస్తాయి. రోజూ చదువుకోవడమన్నది నిజమైన భక్తి, శ్రద్ధ అవుతుంది.

## 76

మనిషికి సహజముగా పనులు చేస్తున్నప్పుడు "నేనే చేస్తున్నాను" అనే భావన కలుగుతుంది. ఆ భావన కలిగినపుడు మనతో సంబంధము లేకుండానే మనలను చాలా దోషములు ఆవరిస్తాయి. అలా ఆవరించడము వలన అహంకారము బాగా పెరుగుతుంది. అహంకారము ఎంత పెరిగితే అంత దైవానికి దూరమవుతాము. అహంకారము తగ్గాలంటే మనలో చేయించే వాడొకడున్నాడు, వాడు చేయిస్తాడు. మనము వానిని ఆరాధన చేసుకుందాము. "వాని సంకల్పమే నా సంకల్పముగా సాగనీ!" అని అనుకోవాలి. పరమ భాగవతోత్తములంతా తమ వ్యక్తిగత జీవితాన్ని భగవంతునికే వదిలివేశారు. అహంకారము కలిగినప్పుడు ఎప్పటికప్పుడు వెంటనే కడుక్కోగలగాలి. అలా కడుక్కోగలిగితే అదృష్టము. లేకపోతే పేరుకుపోతూ ఉంటుంది.

## 77

సాధన రాత్రిపూట చాలా మంచిది. దర్శనాలు కూడా రాత్రిపూటే జరుగుతాయి. అందుకని శ్రీహరి యొక్క దివ్య మంగళ విగ్రహమును ధారణచే (మనస్సుచే దర్శించు చుండుట) నిలుపుకొన వలెను. పడుకొనే ముందు చేసుకొనే ఆరాధన చాలా ముఖ్యము. పైగా మన గురువుగారి (కృష్ణుడి) దంతా వెన్నెల వ్యవహారము. రాత్రి పూట చిట్టచివరి భావన ఏదయితే ఉంటుందో దానితోనే కథ ప్రారంభమౌతుంది. ఏ భావనతో close చేశామో ఆ భావనతో life open అవుతుంది. అపుడు మనలో కొంత స్థిరపడి రుచి పెరుగుతుంది. రుచి ఉంటే అనుభూతి, దైవసాన్నిధ్యము ఉంటుంది.

# 78

ప్రపంచానికి (జీవులకు) ఏమీ చేయడానికి సంసిద్ధత లేనివారు కూర్చుని చేసే ఉత్త చర్చలు దైవము ఒప్పుకోడు. చర్చలు కాదు, ఏమి చేశావు? అదే లెక్క. ఇంత చేశాను, అంత చేశాను అని చెప్పుకుంటే ఒప్పుకోడు. నువ్వు ఎంత అనుగ్రహించావో, అంతవరకే ఏదో కాస్త చేయగలిగాను అంటే సరే పద లోపలికి అంటాడు. దైవముతో సంబంధము మనకు జీవుల సేవతో వస్తుంది తప్ప పాండిత్యముతో రాదు. దైవముతో మనము ఉంటే అన్ని శాస్త్రములు మన దగ్గర ఉంటాయి. ఈ తెలివి యందు స్థిరపడినవారు మాత్రమే నారాయణుని యందు నిలబడుదురు. కారణ మేమనగా భౌతిక శరీరము ఒక్కటే ఉత్తమ సాధనకు పనికివచ్చు విద్యాలయము. అది విడిచిన తరువాత మరల దేహము ధరించువరకు సంసారబద్ధులకు ఎట్టి సాధనయు జరగదు. ఈ వాక్యాలన్నీ ఒక వందసార్లు కాపీ వ్రాస్తే మన లోపల స్థిరపడతాయి.

## 79

పైథాగరస్ అనే పరమగురువు దగ్గరకి ఎవరైనా వచ్చి మేము మీ దగ్గర శిష్యరికము చేస్తాము అంటే ఆయన ఒక పళ్ళెములో ఇసుక పోసి ఒక త్రికోణము గీయరా అని చెప్పేవారు. ఆ త్రికోణము గీస్తే ఆ మూడు కోణాలు చూసి వాళ్లల్లో రజస్సు ఎక్కువా, తమస్సు ఎక్కువా, సత్త్వము ఏ పరిస్థితులో ఉన్నది అని చూచుకొనేవాడు. ఆ తరువాత దానిని బట్టి శిక్షణ ఇచ్చేవారు. (కొంతమంది గీస్తే సమకోణ త్రిభుజములాగా ఉండదు.) బద్ధకస్తులకు ఒక శిక్షణ, over action వాళ్ళకి ఒక శిక్షణ, ఎక్కువ మాట్లాడేవాళ్లకు ఒక శిక్షణ, అసలు మాటే మాట్లాడకుండా ఉండేవాళ్లకు ఒక శిక్షణ ఇచ్చేవారు. అనగా వాఙ్మయ, మనోమయ, శారీరక శిక్షణ. మనలో ఉండే వికారాలకు ప్రధానమైన కారణము మనలో ఉండే గుణముల సమ్మేళనం. ప్రొద్దున లేవగానే 'నీ ఇచ్ఛగా నా జీవితము నిర్వర్తించు' అని ప్రార్థన చేస్తే మార్గములన్నీ విష్ణుమార్గము లవుతాయి.

## 80

భగవంతునికి నమస్కరించుట, పూజలు చేయుట, ధ్యానించుట, నామసంకీర్తనము చేయుట, ఆయన లీలలను చెప్పుకొనుట వలన ఆశ్చర్యకరమైన వైభవములు, శుభకరమైన అభివృద్ధి కలుగునని భాగవతము ప్రకటిస్తున్నది. ప్రతి నిత్యము ఆర్ద్రతతో, భక్తితో, శ్రద్ధతో ఒక అష్టోత్తరము చదివినా క్రమముగా మన దోషాలన్నీ పోతాయి. స్తోత్రము చేస్తుంటే దైవము అక్కడ కూర్చుని ప్రసన్నముగా వింటున్నట్టుగా భావన చేయాలి. మనము చదివే స్తోత్రము మనమే వినము. ఇక దేవుడు ఎందుకు వింటాడు? చేసేవారి మనసు ఎటో వెళ్ళిపోతే దైవము అక్కడనుంచి వెళ్ళిపోతాడు. పూజ బాగా జరుగుతుంటే ధ్యానస్థితి సహజముగా కలుగుతుంది. అపుడు అతనే వైభవము యిస్తాడు.

## 81

అంతర్యామి దైవము అవగాహన అయి ఆ దైవముతో ముడిపడి జీవించడం అనేది సద్గురువు చేయును. అంటే అర్థమేమిటంటే అతని దగ్గర సత్యమున్నది. ఆ సత్యాన్ని యితర విషయాలలో బాగా ఆసక్తి ఉన్నవాళ్లకు అందించడు. వారందరూ ఆయన శిష్యులు అనుకోవడానికి వీలులేదు. బ్రహ్మము యందు ఉన్ముఖుడై చాలా కాలం అదే భావనలో ఉంటే ఉపదేశము చేస్తాడు. అపుడే సరస్వతి అక్కడ దిగడానికి సంకల్పిస్తుంది. గురువు తన దగ్గర ఉండే సరస్వతిని ఎటు ప్రవహించాలంటే అటు ప్రవహింప చేస్తాడు. ఆ సరస్వతి ఎవరిని స్పృశించి, అనుగ్రహించి, ఎవరిలోకి ప్రవహిస్తుందో వారంతా గురుపరంపరలో భాగమవుతూ ఉంటారు.

## 82

భాగవతము నందు భగవంతుని అస్థిత్వము ఉన్నది. ఇది సూటిగా అనుభూతి నిచ్చే గ్రంథము. ఒకరు చెపుతూ ఉంటే, ఇతరులు వింటూ ఉంటే అక్కడ భగవంతుడు అవతరిస్తాడు. అలా అవతరించడము చేత దైవ స్పర్శ ఎవరికి అందితే వారికి లోపలినుంచి భాగవతము ప్రకాశమవుతుంది. ఇది ఒక రహస్యము. అందుకనే భాగవతము భాగవత రహస్యప్రకాశము అయినది. భాగవతము మన మేధస్సు చేత మథించి అర్థము చేసుకొనే గ్రంథము కాదు. అందుకని గురుపరంపరను స్మరణ చేసుకోవాలి.

## 83

దైవము ప్రతి వారిలో నాలుగు స్థితులలో దిగివస్తాడు. 1. 'వాసుదేవ' స్థితి. అందరిలో, అంతటా దైవము ఉండు స్థితి. 2. 'సంకర్షణ' ప్రజ్ఞ. అంతటా వ్యాపించి ఉన్న దైవము తనలో కూడా ఉండుట చేత తాను ఉన్నానని తనకు తెలుస్తుంది. దైవము వలన మనమున్నామన్న భావన మరచిపోతే ప్రాణము నీదేనా, తెలివి నీదేనా అని ప్రశ్నించుకోవాలి. ఇది మొట్టమొదటి మరపు. 3. 'ప్రద్యుమ్న' స్థితి. అనగా బుద్ధిలోకము లోనికి దైవము తానే దిగివస్తాడు. బుద్ధిని ప్రచోదనము చేయడముకోసమే గాయత్రి మంత్రము, సద్గ్రంథములు, సద్గురువులను యిచ్చారు. దైవముతో అనుసంధానము చెంది ఉంటే బుద్ధి బాగా పనిచేస్తుంది. 4. 'అనిరుద్ధ' ప్రజ్ఞ. బుద్ధితో సంప్రదించి ఇంద్రియముల ద్వారా పనిచేయాలి. ఒకే తత్త్వము నలుగురుగా పనిచేస్తుంది.

## 84

అందరియందుతెలివిగా,ప్రవర్తనగా,ప్రాణస్పందనగా ఒకే ఒక చైతన్యము అన్నిప్రాణులయందు నిండి ఉన్నది కాబట్టి దానితో సంబంధము ఏర్పరచుకొని, దానిని గమనిస్తూ ఉండమని భాగవతము చెబుతుంది. ఇలా అంతర్యామి సాధన మీద పట్టు చిక్కాలంటే భగవదనుగ్రహము కావాలి. భగవదనుగ్రహము ఎపుడు కలుగుతుందంటే జీవులలో ఉండే దేవుడు సంతోషించేటట్లుగా మన ప్రవర్తన ఉంటే, దైవము యొక్క అనుగ్రహము కలుగుతుంది. అలా ఉన్న వారికి ఏ విషయమైనా తను కోరడం అనేది తగ్గిపోయి, అవి జరుగుతూ ఉంటాయి. కీర్తి, సంపద, అంగబలము అన్నీ చేరతాయి. అంతర్యామి సాధన అంటే ఎదుటి వ్యక్తి యందలి దైవముతో ముందు అనుసంధానము ఏర్పరచుకొని అటుపై ఆ వ్యక్తితో ప్రవర్తించాలి. ఎన్నిసార్లు చెప్పుకున్నా పట్టు చిక్కదు. కానీ పట్టుకోవాల్సినది అదే.

## 85

సామాన్య జీవులందరూ మరణము అనేది వస్తుందని తెలిసినా దానిని గూర్చి ఆలోచించక పోవడము అవివేకం. ఆలోచించకపోతే తాను ఉంటున్న ఇంట్లోనే కాలిపోయినట్లు అయిపోతుంది. ఆలోచించే మార్గము ఏర్పరుచుకుంటే అది ముట్టుకొనే లోపల మనము బయటకి వెళ్లిపోవచ్చు. ఆ విద్య తెలియాలని ఋషులకు, యోగులకు ఎంతో తపన. ప్రతి రోజు నిద్ర మన మనస్సుకు అంత్యకాలము. మనలో ఉండే దేవుని నుంచి మొత్తములో ఉండే దేవునిలోకి వెళ్లిపోయే మార్గము ఒకటి ఉన్నది. రోజూ నిద్రలోకి వెళ్ళేటప్పుడు అటుప్రక్క దైవము ఉన్నాడు, ఇటు ప్రక్కన మనము ఉన్నాము, ఆయన పాదాల దగ్గర పడుకున్నాము, ఆయన మన చేయి అందుకుంటాడు అన్న భావనతో పడుకుంటే అలాంటి వారికి మరణము గూర్చిన భయముండదు.

## 86

భగవంతుడిని చేరడానికి మొట్టమొదట కావలసినది శ్రద్ధ. శ్రద్ధ ఉన్నవాడికే పురోగతి. శ్రద్ధ లేకపోతే తిరోగతి చెందుతాడు. శ్రద్ధ అన్నింటిలోనూ కుదరాలి. మన స్వభావములో మొత్తమంతా అశ్రద్ధ వుండి ఒక్క విషయములో శ్రద్ధ ఉంటే ఊరికే కంగారుగా పని చేయడము ఉంటుంది. శ్రద్ధ కలిగినవాడికే మార్గము. అశ్రద్ధ ఉన్నప్పుడు మనలో నారాయణుడు నిద్ర వంటి స్థితికి వెళ్ళిపోతాడు. పెద్దల ఆశ్రమములో మొట్టమొదట శ్రద్ధ నేర్పి, అందులో ఉత్తీర్ణుడయితే విద్య నేర్పేవారు. పుస్తకము ఇచ్చినా నలిపివేయడు. పుస్తకము తెరిచే విధానములో గూడా శ్రద్ధ ఉంటుంది. అలాగే ప్రతి పనిలోనూ శ్రద్ధగా ఉండాలి.

# 87

ఉత్తరమనే దిక్కు చాలా నిశ్శబ్దముగా ఉంటుంది. కనబడదు. ఆ దిక్కు నుండి తూర్పు, పడమరలు ఏకకాలములో ఏర్పడతాయి. కనబడక పోవడము వలన మనము తూర్పు దిక్కును ప్రధానముగా భావిస్తాము. తూర్పు అంటే పురుషుడు, పడమర అంటే ప్రకృతి. మళ్లీ అదే ఉత్తరము నుండి తూర్పు పడమరల ద్వారా దక్షిణము పుట్టుకు వస్తుంది. అవ్యక్తమైన ఉత్తరదిక్కు వ్యక్తమైన దక్షిణ దిక్కుగా ఉంటుంది. మనలో శిఖ ఉత్తరదిక్కు. ఫాలభాగము తూర్పు దిక్కు. మూలాధారం పడమర దిక్కు. హృదయము దక్షిణ దిక్కు. హృదయములో ఉండేవారికి శిఖ చేరడము పెద్ద అసాధ్యమైన విషయము కాదు. హృదయము నుండి శిఖకు సూటియైన దారి ఒకటి ఉన్నది. అందుకనే భగవంతుని ఆరాధన హృదయములో చేసుకోమని చెపుతారు.

# 88

సత్కర్మలను దైవముపై భారముంచి కర్తవ్య నిర్వహణముగా చేసినచో మోక్షమునకు దారితీయును. అర్పణ చేయడము నేర్చుకుంటే ఏదో ఒక రోజున మనలని మనము అర్పణ చేసుకోవడముగా, మనకున్నది అర్పణ చేయడముగా పరిణమిస్తుంది. దానిని ఆత్మార్పణం అంటారు. అలాంటి వారు భగవంతుని కోరడం అంటూ ఉండదు. వారికి స్వంత జీవితము ఉండదు. అంతా భగవంతుడిచ్చినదే అని భావించి, భగవత్పరముగా జీవిస్తారు కాబట్టి, వారి కష్టము గూడా భగవంతుడే తీరుస్తాడు. సుఖమిచ్చినా, దుఃఖమిచ్చినా, జయమిచ్చినా, అపజయమిచ్చినా అంతా దైవ ప్రసాదము అని భావిస్తారు. వారిని ఆళ్వారులంటారు.

## 89

మనలో ఉచ్ఛ్వాస నిశ్వాసలు చక్కగా నిర్వర్తింపబడుతూ ఉంటే మనలోని ప్రాణము అన్ని దిశలకు చక్కగా ప్రవహిస్తూ ఉంటుంది. కాని మన ఆలోచనలు, మన మాటలు, మన చేతలు అప్పుడప్పుడూ మన ప్రాణానికి ఆందోళన, అంతరాయాలు కలిగిస్తూ ఉంటాయి. అందుచేతనే ప్రాణశక్తి తగ్గి మనకు జబ్బులు వస్తుంటాయి. ప్రాణశక్తి ఒకవైపు ప్రవహిస్తూ ఉంటే, ఇంకొకవైపు ప్రజ్ఞాశక్తి మనస్సు, ఇంద్రియములు, శరీరము ఆధారముగా పనిచేస్తుంటుంది. ప్రాణము, ప్రజ్ఞ రెండూ కలిసిన చోటును "ఆత్మ" అంటారు. మనము యోగాభ్యాసము, ప్రాణాయామము అని చేసే కార్యక్రమములలో మొట్టమొదటి మెట్టు ఏమిటంటే ప్రాణము, ప్రజ్ఞ అనే రెండు పాయలను ఒక చోటికి చేర్చడము. శ్వాస మీద మనసు పెట్టడము ఒక క్రమశిక్షణతో ఎవరు నిర్వర్తించుకుంటారో వారికి బొడ్డులో ఉండే ప్రజ్ఞ హృదయమును చేరుతుంది. (మనిషికి సహజముగా ప్రజ్ఞ బొడ్డులో ఉంటుంది.)

## 90

దైవమును మనకు కావలసినవన్నీ కోరుకోవడము play school లాంటిది. కొన్ని ఫలించినట్లు ఉంటాయి, కొన్ని ఫలించనట్లు ఉంటాయి. భగవంతుడిని అడుక్కు తినేవారందరినీ పదిమందికి పెట్టేవారుగా తయారు చేయడానికే పరమగురువుల ప్రయత్నము. నా గురించి కాక పదిమంది శ్రేయస్సు గురించి చేస్తాను అనే దీక్ష మొదలుపెడితే అపుడు భగవంతుడు నీకు నేనున్నాను అని అండగా నిలబడతాడు. జీవునికి తరింపు పరహితమే. ఇంకో మార్గము లేదు. భూమి మీద మానవుడు బాధ్యతగా, ధర్మపరముగా జీవిస్తూ ఉంటే భగవంతునికి అందివచ్చిన కొడుకు లాగా తయారవుతాడు.

## 91

భాగవతము అంటే భక్తిపరముగా కాసేపు భజన చేయడమే కాదు. భగవతత్త్వము తెలిపి, భగవంతుడంటే ఏమిటో తెలిపి, దానితో మనము నిరంతరముగా ఎట్లా అనుసంధానం చెందాలో భాగవతము చెపుతుంది. దైవపరముగా చెప్పినది ఆచరిస్తూ ఉంటే అదే నీకు అందుబాటులోకి వచ్చి వికాసము కలిగిస్తుంది. ఒకే పనిని (సత్కార్యమును) ఒకే రకముగా, ఒకే సమయములో 12 సంవత్సరములు చేస్తే, బృహస్పతి అనుగ్రహిస్తాడు. బృహస్పతి అంటే గురువే. అపుడు మనలో దృఢముగా పీకినా రానంతగా పాతుకుపోతుంది. ఏ విషయము మీద మనసును లగ్నము చేసినా అందులో ఉండే హృదయస్తమైన విషయము మనకు అందుతుంది.

## 92

మనము ఈషణత్రయము అని మూడింటిలో కొట్టుకుపోతూ ఉంటాము (దారేషణ, ధనేషణ, పుత్రేషణ). ప్రతివారికి వారి డబ్బు, వారి ఆస్తిపాస్తులు, వారి భర్త లేక భార్య, పుత్రులు ఈ మూడింటి చుట్టూ తిరుగుతూ ఉంటారు. భగవంతుని సృష్టిలో నీవంతు కర్తవ్యముగా సంతానమును కని పెంచాలి తప్ప, అంతకు మించి జిగురు ఉన్నదే దాని వలన మనిషి పతనము చెందే అవకాశము చాలా ఉన్నది. వారూ నీలాగా వచ్చినవారే. క్రిందటి జన్మలో వారు ఏమిటో నీకు తెలియదుగా! పై జన్మలో వారెవరో తెలీదు. వారితో పెనవేసుకొని రకరకములుగా గింజుకుంటూ బాధపడడము మూర్ఖత్వము. ఎన్నాళ్ళు పూజలు, హోమములు, అభిషేకములు చేసినా ఈ తత్త్వము తెలియకపోతే యిలాగే ఉండిపోతాము.

## 93

ఎక్కడ ఉత్తమమైన శబ్దములు చక్కగా ఉచ్చరింప బడతాయో అక్కడ చక్కటి వెలుగు ఆవిర్భవిస్తుంది. ఋషి ప్రోక్తమైన వేద సూక్తములు, విష్ణు సహస్ర నామము, లలిత సహస్ర నామము చదువుకుంటే లోపల sound and light show జరుగుతుంది. షోడశ ఉపచారములు చేసి కనులు మూసుకొని లోపల మూర్తిని దర్శనము చేస్తూ స్తోత్రము చేస్తే లోపల రకరకములైన వెలుగులు, నాదకళ కనిపిస్తాయి. నాదము అంటే శబ్దము. కళ అంటే వెలుగు. శబ్దతరంగముల వలన మన లోపల ధాతువులలో తమస్సు హరింప బడుతుంది. మనస్సు తేలికయై వెలుగును ప్రతిబింబింపచేసే శక్తి కలిగి ఉంటుంది.

## 94

సూక్తములు, స్తోత్రములు, కీర్తనలు, భజనలు ఇవన్నీ అగ్ని బీజముతో కూడిన శబ్దములు. కంఠముతో ఎంత బాగా చదువగలిగితే ఐదవ తత్త్వమైన ఆకాశతత్త్వము (విశుద్ధి చక్రము) మెరుస్తుంది. శబ్దాన్ని బట్టి ఆకాశము, ఆకాశాన్ని బట్టి వాయువు, వాయువును బట్టి అగ్ని, అగ్నిని బట్టి జలము, జలమును బట్టి పృథ్వి- అన్నీ పవిత్రత చెందుతాయి. Repair కంఠము నుంచి మొదలవుతుంది. అమృతతుల్యమైన స్తోత్రములు చేసిన కంఠముతో విషపూరితమైన మాటలు మాట్లాడితే ఆ కంఠానికి చాలా స్పర్ధ వస్తుంది. పాలు పోస్తున్నాము, మురికీ పోస్తున్నాము. శుభ్రమైన పదాలు ఒక గంట పలకగలిగితే పంచకోశములు శుభ్రపడతాయి.

## 95

కృతయుగములో మానవులు ఆత్మతో జీవిస్తారు. త్రేతాయుగములో బుద్ధితో జీవిస్తారు. ద్వాపరయుగములో మనసుతో జీవిస్తారు. కలియుగములో ఇంద్రియములతో జీవిస్తారు. ఇంద్రియములు దాటి రాలేరు. కన్నుతో చూచేది, చెవితో వినేది, చేతితో తాకేది, అన్నిటిలో నుంచి దైవాన్ని చూస్తూ, ఇంద్రియాలతో పనిచేస్తూ అనుభూతిని పొందుతున్నవాడు ఏ ఇంద్రియముతోనూ over action చేయడు. Under action చేయడు. సమతుల్యముగా చేస్తాడు.

## 96

భాగవతములో స్త్రీ గురించి యిలా ఉన్నది. స్త్రీ సృష్టి స్వరూపము. ఈ సృష్టిలో పురుషుడు సవ్యముగా జీవించాలన్నా, తరించాలన్నా స్త్రీ యొక్క అనురాగము ముఖ్యము. స్త్రీని దూషించి పరమును చేరువారు ఎవరూ లేరు. స్త్రీని గౌరవించినవాడికే మార్గము సులువవుతుంది. స్త్రీకి చేసినదంతా అమ్మవారికి చేసినట్లే. భక్తులందరూ స్త్రీని నొప్పించకుండా బ్రతికినవారే. ఎంత మంచి గుణములు కలిగిన సత్పురుషుడైననూ ఎన్ని జన్మలు అయినా భార్య ఋణము తీర్చుకోలేడు. ఋణము తీర్చుకోకుండా బాధ కూడా కలుగజేస్తే చాలా రకాల ఆపదలు వస్తాయి. ఋషులందరూ చాలా శక్తివంతులవడానికి కారణము వారి ధర్మపత్నుల వలననే.

## 97

మహాభక్తులు అంటే భగవంతునితో ఎట్టి పరిస్థితులలోనూ ఎడతెగని సంబంధము కలవారు. మన ప్రయత్నము మనము చేస్తున్నప్పటికీ ఆయన మనతో కలిసి ఉండడము ఆయన అనుగ్రహమే కదా! ఒక్కొక్కసారి మనము ఎంత ముడివేసుకున్నా అటు నుంచి ఆయన వదిలివేస్తే మన ముడి జారిపోతుంది. మనము ఎంత పట్టుకున్నాము అనేది ఒకటి. ఆయన ఎంత పట్టుకున్నాడు అన్నది ఒకటి. దైవము కొంతమందిని ఎప్పుడూ పట్టుకుంటాడు. కొంతమందిని అపుడపుడూ పట్టుకుంటాడు. కొంతమందిని పట్టి వదులుతుంటాడు. ఎందుచేత అంటే మనలో రావలసిన పరివర్తనను బట్టి ఉంటుంది.

## 98

ఒక తప్పు మన నుంచి జరిగిన తరువాత మన సంస్కారములో ధర్మముంటే కాస్త అయినా బాధ కలుగుతుంది. సంస్కారములో కొంచెము కూడా ధర్మము లేకపోతే తప్పు చేసినట్టు అనిపించదు. రావణాసురునికి, లంక అంతా నీదే తప్పు అని చెప్పినది. అయినా ఆయనకు అనిపించలేదు. సంస్కారవంతుడైతే తప్పు జరగగానే లోపల పొరపాటు జరిగినదని అనిపించి ఒక రకమైన సంచలనము కలుగుతుంది. ''నువ్వు నాయందు అనుగ్రహిస్తే తప్పు నాలో మార్పు రాదు'' అని దైవముతో చెప్పుకోవాలి.

## 99

దివ్యకర్మ నిర్వర్తించేటపుడు దివ్యమైన శక్తులు ఆవరించి ఉంటాయి. దివ్యకర్మ ఆపేస్తే అన్నీ వెళ్లిపోతాయి. మన ద్వారా సత్కార్యాలు జరుగుతున్నంతసేపు ప్రకృతి మనలను సంరక్షిస్తుంది. మన మనస్సులో దివ్యభావాలు తోచడము గూడా దైవానుగ్రహమే. తోచితేనే చేయగలిగేది. తోచడము మనచేతిలో లేదు. అందుకు గాయత్రి ఆరాధన అన్నారు. మన బుద్ధిని, వెలుగుని వికసింపజేసి, సరియైన సమయములో సరియైన ఆలోచన స్ఫురింపచేయి తల్లీ! అని కోరుకోవాలి. కోరుకోగానే యివ్వదు. ఎవరియందు తనకు అనుగ్రహము కలుగుతుందో వారియందు భాసిస్తుంది. భాసించినవారు విర్రవీగడానికి వీలులేదు. ఎంత భాసిస్తే అంత బాధ్యత.

## 100

మనము మనసును శ్వాస యందు ఉంచి, శ్వాసను స్పందనము మీద ఉంచి, స్పందనము నుంచి హృదయము చేరి, హృదయము నుంచి విశుద్ధి చేరి, అంతర్లీనముగా ప్రయాణము చేయడము సరస్వతీ నది ప్రవేశము అంటారు. సరస్వతి అంతర్వాహిని. ఇడ, పింగళ నాడులను సమన్వయము చేస్తూ, రెండింటికీ ఆధారమై, సూక్ష్మమై సుషుమ్నా నాడి యందు ఉండే ప్రజ్ఞను సరస్వతి అందురు. నదులు అంటే నీరు కాదు, ఒక ప్రజ్ఞా ప్రవాహము. ఒక్కొక్క నదికి ఒక్కొక్క విశిష్టత, గుణము ఉంటాయి. బహిర్ముఖముగా ఎన్ని కార్యక్రమములు చేసినా తెమలదు. సుషుమ్నలో ప్రవేశిస్తే అంతఃకరణములయందు ప్రవేశించినట్లు.

## 101

జీవితము దైవము యిచ్చాడు. ప్రాణము దైవము యిచ్చాడు. మన బుద్ధి గూడా మనది కాదు. అన్నీ తెలిసినా సమయమునకు తట్టకపోవచ్చు. ఆయన యిచ్చినది ఆయన ఎప్పుడైనా పట్టుకుపోతాడు. భర్త, భార్య, పిల్లలు, తల్లిదండ్రులు మొదలగువారి రూపములో దైవమే మన దగ్గర ఉన్నాడు. ఇవన్నీ మనకు బాధ్యతలుగా మనదగ్గర నిక్షిప్తము చేశాడు. నా మనుష్యులను నీ దగ్గర పెట్టాను. వారియందు నీ ప్రవర్తన ఎలా ఉన్నదో గమనిస్తూ ఉంటాను అని అంటాడు దైవము. బాధ్యతలను విస్మరించేవాడికి భగవంతుడు దగ్గర అవ్వడు. అంతా దైవమిచ్చాడని గుర్తుంచుకొని సమర్పణగా జీవించడమే భాగవతమార్గము.

## 102

జీవన సమస్యలు ఏదో కర్మ ఉండడము చేత అందరికీ వస్తూ ఉంటాయి. ఏనాడు సద్గురు పాదపద్మములను స్మరించడము మొదలుపెడతామో ఆయనే చూసుకుంటాడు అన్న విశ్వాసముండాలి. ఆయన చెప్పినట్లుగా ఆయన మార్గములో నడిస్తే సమస్యలు వచ్చి పోతూ ఉంటాయి. కాపురం చేయవు. సద్గురువు ఎప్పుడు సంతోషిస్తాడు? దైవపరమైన విషయములయందు మనము ఆసక్తి చూపిస్తే గురువుకు ఆనందము. ఇతరవిషయములను మాటిమాటికి అడుగుతుంటే సహనం, ఓర్పు కలవాడు కాబట్టి మనకు సలహాలిస్తారు. ఎక్కడికి వెడితే ఏమి కోరాలి అన్నది తెలియాలి. తెలియకపోతే బంగారము కొట్టుకు వెళ్లి చింతపండు అడిగినట్లు ఉంటుంది.

## 103

బ్రహ్మజ్ఞాని యనగా ఒక బాధ్యతయే గాని పదవి కాదు. అది పొందినవాడు బ్రహ్మవలె సృష్టిని చక్కబెట్టు చుండవలెను కాని దాని ననుభవించుచూ కూర్చుండుటకు వీలులేదు. బ్రహ్మజ్ఞానికి కర్తవ్యాలు ఎక్కువుంటాయి. ఇట్టి బాధ్యతకు సిద్ధమైన వానికి మాత్రమే బ్రహ్మజ్ఞానము ప్రసాదింపబడునని భాగవతము ఉపదేశించుచున్నది.

## 104

మాట్లాడుట అనేది అగ్ని అనే అధిదేవత వలన జరుగుతుంది. వాక్కులోనుంచి చాలా రకాలుగా శక్తి వస్తుంది. నిత్యము అబద్ధాలు చెప్పి బ్రతికేవారికి వాక్కులో ఏ విధమైన శక్తి ఉండదు. మాట్లాడడం ఒక బాధ్యత. అడ్డమైనవన్నీ మాట్లాడకూడదు. మడతలు పెట్టి మాట్లాడ కూడదు. నాలుక ఎలాంటిదంటే మనలను ఎంత ఊర్ధ్వగతికి తీసుకొని వెడుతుందో అంత అధోగతికి తీసుకొని వెడుతుంది. సాక్షాత్తూ పరతత్త్వమే అగ్నిగా దిగివస్తుంది. అలాంటి అగ్ని మనలో పోషింపబడాలంటే వాక్కును వృథాగా వాడకూడదు.

## 105

అధోక్షజుడు అనగా సృష్టిలోకి దిగివచ్చిన దైవము. అనగా ఏ రూపము లేక అంతటా వ్యాప్తి చెందినవాడు. అన్నిటినీ అరమోడ్పు కన్నులతో క్రిందకి చూస్తూ ఉంటాడు. మామూలుగా సంస్కారవంతులైన సత్పురుషులకు భూమివైపు దృష్టి ఉండి క్రిందకి చూపులు కలిగి ఉంటాయి (చుట్టుప్రక్కల గాకుండా). అది వారిలో ఉండే వినయము, భగవతత్త్వము, 'అధోక్షజ' తత్త్వము. మనసు పెట్టి శ్రద్ధతో 'అధోక్షజాయ నమః' అనగానే శిరస్సు నుంచి పాదము వరకు electrical manifestation జరుగుతుంది.

## 106

యోగి అనగా కుటుంబము నందు, వృత్తి నందు, సంఘము యందు ఉండి, సూక్ష్మలోకాలలో గూడా ఉండేవాడు. మానవ లోకాలలో, కారణ లోకాలలో, బ్రహ్మ లోకాలలోనూ ఉంటాడు. అన్నిటిని సమర్థవంతముగా నిర్వహించేవాడు యోగి. ప్రజ్ఞకు, పదార్థమునకు సమతూకమైన ప్రాధాన్యత యిస్తాడు. అది యోగి యొక్క గొప్పతనం. భగవంతుడు 14 లోకములను ఒకే ప్రాధాన్యముతో, ప్రేమతో సమర్థముగా నిర్వర్తిస్తున్నాడు కాబట్టి అతను యోగేశ్వరుడు. యోగేశ్వరుని చూచి యోగీశ్వరులు, యోగీశ్వరులను చూచి యోగులు తయారవుతారు.

## 107

వైకుంఠములో ఎప్పుడూ వసంతఋతువే ఏర్పడి ఉంటుంది. వసంతము అనగా వర్తమాన కాలమందు ఎవరి చైతన్యము శాశ్వతముగా నిలిచి (జరిగిన కాలము నందు, జరుగబోయే కాలము నందు ఉండకుండా), ప్రస్తుత కాలమందు కనబడుతున్న దృశ్యము నందు దైవీతత్త్వమును, అంతర్యామి తత్త్వమును దర్శనము చేస్తారో అలాంటివారు వైకుంఠమునందు, వసంతఋతువు నందు ఉన్నట్లు. ఎక్కువగా జరిగినది, జరుగబోయేది మనకు మనసులో మెదలుతాయి. ‘‘వర్తమానములో ఉండకుండా ఉంటే అశుచిగా ఉన్నట్టు’’ అని భగవద్గీతలో దైవము అర్జునునికి చెప్తాడు. వర్తమానములో ఉంటేనే వసంతఋతువు.

## 108

విరాట్పురుషుడిలో ఉన్న దేవతా ప్రజ్ఞలన్నీ మన శరీరములో నిండా ఉన్నాయి. వాటిని మేల్కొలిపి, వాటిని అనుసరించి ముందుకు వెళ్ళాలి. వీరందరూ పెద్ద నిధులవంటి వారు. మనలో ఉన్నారు కాని మనకు తెలియదుగా! మనము ఆ ప్రజ్ఞలని వాడేసుకుంటాము. అన్య విషయముల కన్నా విశ్వేదేవతలతో అనుసంధానం చెందుతాను అన్నవాడు బ్రతికి బట్టకడతాడు. వినబడుటలేదు, కనబడుటలేదు అని తెలిసినప్పుడు ఆ ప్రజ్ఞలు వదిలి వెళ్లిపోతున్నాయని అర్థము. విశ్వేదేవతలను రోజూ తలచుకున్నా, నమస్కారంచేసినా, స్మరణ చేసినా వారు తృప్తిపడి, ప్రతిస్పందించి అనుగ్రహిస్తారు.

## 109

భక్తులమనుకొనే వారంతా సంధ్యా సమయములను బాగా సద్వినియోగము చేసుకోవాలి. ఉదయము చీకటి నుంచి వెలుగులోకి, సాయంత్రము మళ్ళీ వెలుగు నుంచి చీకటిలోకి వెడుతున్నప్పుడు ఆ సమయములో సృష్టిలో చాలా రసాయనం జరుగుతుంది. దాని ననుసరించి మన శరీరములో కూడా రసాయనము జరుగుతుంది. సృష్టిలో జరిగేదానితో అనుసంధానం చెందడమన్నది భక్తుడికి ముఖ్యము. ఆరంభమునకు ఆదిత్యుడు, అంతమునకు (సాయంకాల సమయము) రుద్రుడు. ఈ సమయములలో కాస్త భక్తి, శ్రద్ధతో మౌనముగా ఉండి ప్రార్థన చేసుకోవాలి. అందుకే మనకి యోగములో ఉదయము, సాయంత్రము 6 గంటలకు ప్రార్థన చేయమన్నారు.

## 110

మన యందు సత్త్వగుణము బాగా పెంపొందించు కుంటూ ఉంటే మనలో వాసుదేవతత్త్వము స్థిరపడుతుంది. అపుడు వైకుంఠమునందు ఉన్నట్టు ఉంటుంది. ఆనందము, సుఖము, శాంతి, దానము, దయ ఉంటాయి. ఆకలి, దప్పిక, ముసలితనం ఇవేమీ ఉండవు. మనవారు, ఇతరులు అను మోహము ఉండదు. సర్వకాల సర్వావస్థలయందు సత్త్వము నందు అనుసంధానం చెందినవారే వశిష్ఠాది ఋషులు. సత్త్వగుణ ప్రధానముగ దినచర్య నడుస్తూ ఉంటే అప్రయత్నముగా సుఖముగా ఉండడమన్నది సిద్ధిస్తుంది. నారాయణుడే వాసుదేవుడిగా దిగివచ్చి సత్త్వగుణము యందు ఉంటాడు.

## 111

సృష్టి అంతటా వ్యాప్తి చెందినటువంటి తత్త్వము యొక్క అస్థిత్వము మన యందున్నది. ఆ మూలముతో లేక ఆ తత్త్వముతో మనము ముడిపడితే మనకుండే ఆవరణలన్నీ తొలగిపోతాయి. అది గుర్తుంటే జ్ఞానము. దానితో మనము అనుసంధానం చెందడానికి ప్రయత్నము చేస్తుంటే యోగము. అందుకే ప్రార్థన. అందుకే ధ్యానము. మూలము నుంచి దిగివచ్చిన వారము కాబట్టి మూలమును మర్చిపోకుండా ఉంటే మన గురించి ఏర్పడినటువంటివేమీ మనలను ముట్టుకోవు.

## 112

పరమగురువులు యజ్ఞార్థకర్మకే పెద్దపీట వేశారు. యజ్ఞార్థము అనగా తన కోసము వెంట్రుకవాసి అంత కూడా స్వార్థము లేకుండా పరహితము చేయాలి. వానిని మాయ బంధించదు. తన కోసము ఎంత ఆలోచిస్తే అంత రాక్షసమాయ ఉంటుంది. మాయ దైవమును అడుగుతుంది- ఎవరిని ముట్టుకోమంటావు, ఎవరిని వదిలేయమంటావు అని. 'నేను' అన్న ప్రతివాడినీ ముట్టుకో ఏం ఫరవాలేదు అని దైవము అంటాడు. నిన్ను గురించి మర్చిపోయి పదిమందికి పనికివచ్చే పనిచేస్తే నారాయణుని దగ్గర appointment ఉంటుంది. లేకపోతే disappointment ఉంటుంది.

## 113

స్వప్నము నుంచి మేల్కొంచితే స్వప్నవిషయములు ఏ విధముగా బాధించవో, ఈ జీవితమనే స్వప్నము నుంచి మేల్కొన్నవాడిని ఏదీ బంధించదు. ఈ జీవితము కల అని తెలిసినవాడు అక్కరలేని పనులు చేయడు. మన లోపల ఈశ్వరుడు సాక్షిగా ఉన్నాడు. ఎవరి నుంచీ తప్పించుకోలేము. మనము చేసినది మనలను చుట్టేస్తుంది. వైవస్వతమనువు నిర్మించిన show room లోనుంచి వచ్చిన వాళ్ళము. అందులో హెచ్చుతగ్గు లుండవు. మన వాడకములోనే హెచ్చుతగ్గులు.

# 114

హరి చింతన చేయడానికి హరి అనుమతి, అనుగ్రహము ఉండాలి. అనుగ్రహానికి ప్రార్థన ఒక్కటే మార్గము. ఉన్నదాని కన్నా పరిస్థితులు, దినచర్య బావుండాలన్నా ప్రార్థనే మార్గము. మన కర్మపరిపాకము ముదురుగా ఉంటే ప్రార్థన, సద్గ్రంథ పఠనం చేయలేము, వినలేము. అవి కావాలి, ఇవి కావాలి అని ప్రార్థన చేయడము కాదు. గ్రంథపఠనము చేయలేక పోతున్నాము, రాలేకపోతున్నామని ప్రార్థన చేయాలి. ఏది ఉన్నతిని కలిగిస్తుందో అది చేయలేక పోతున్నందుకు ఆర్ద్రత ఉండాలి. నారాయణుని చరిత్రము ఎంత విన్నా యింకా వినాలనిపిస్తే ఆ జీవుడు గట్టెక్కుతాడు. భాగవతము విందాము, చదువుకుందాము అనేది యితర విషయముల కన్నా ప్రధానముగా పెట్టుకుంటే క్రమముగా జీవుడికి ఊర్ధ్వము, ఉన్నతము అయిన మార్గములోకి దారి దొరుకుతుంది. లేకపోతే ఇలాగే ఉంటాం.

# 115

''ఓం నమః'' అనేది పెద్ద మంత్రము. ''ఓం నమః'' అంటే అర్థము నేను లేను అని. మనలో మనవలె ఉన్న దైవము మనలను మేల్కొలిపితే మనము నిద్రలేస్తున్నాము. నేనే లేచాను అనుకుంటే పూర్తి అజ్ఞానము. దైవసంకల్పము ఉండబట్టే అతడే నేనుగా లేచాను అని తెలుసుకోవాలి. 'ఓం నమః' అని నిద్ర లేవగానే అనుకోవాలి. దైవము పనే నా పనిగా సాయంత్రము వరకు పని చేసుకుంటాను. అతడి కోసమే జీవిస్తాను. అన్నిటిలో అతనినే దర్శనము చేస్తాను అని ప్రార్థన చేయాలి. అదే ఇదిగా ఉన్నది కాబట్టి జరుగుతున్న దానిలో దైవమును చూడాలి. ఇలా ఒక ప్రయత్నము చేయడము భాగవత మార్గములో పరాకాష్ఠ.

## 116

ముగ్గురి మధ్య ఎలాంటి అరమరికలు లేకుండా, పరిపూర్ణముగా ఒకరి యందు ఒకరు అనురాగము కలిగి ఉంటే ఒక సృష్టినే నిర్మాణము చేయవచ్చు. వారే బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు. ఇది ఆధ్యాత్మిక త్రిభుజము. అది చెదిరితే సృష్టి చెదురుతుంది. ఇలాంటి నమూనాలు ఏర్పడడానికి 4 వ్యూహములు ఏర్పరచారు. పూర్ణము ఒకటవ స్థితి. త్రిభుజము రెండవ స్థితి. వృత్తములో చతుర్భుజము మూడవ స్థితి. షడ్భుజి నాల్గవ స్థితి. వీటి గురించి ఆలోచన, తపన ఉండాలి. భూమిచుట్టూ 24 మంది సిద్ధులు వాతావరణములో సంచారము చేస్తూ ఉంటారు. తపన కలిగినవారికి చక్కని వికాసము కలిగిస్తారు.

*స్వస్తి!*

# DHANISHTA PUBLICATIONS

D.No. 15-7-1, Angels' Enclave, Krishna Nagar,
Visakhapatnam - 530 002.
Phone : 0891- 2701531, 2509154

## WRITINGS OF MASTER PARVATHIKUMAR

| | | |
|---|---|---|
| 1. | Agni | E |
| 2. | A Clean Life | E/G/S |
| 3. | Adhyatmika Gigyasa | K |
| 4. | Amanaskudu | K/T |
| 5. | Ambareeshudu | T |
| 6. | Antardarsana Dhyanamulu | T/K |
| 7. | Anveshakudu | T |
| 8. | Asangudu | T/K |
| 9. | Aries | E |
| 10. | Ashram | E |
| 11. | Ashram Leaves | E/G/S |
| 12. | Aswini Devatalu | T |
| 13. | Ashram Regulation for Entry | E/G/S |
| 14. | An insight into the WTT | E |
| 15. | Atmasadhana Sutramulu | T |
| 16. | Avathara of Synthesis | E |
| 17. | Ayurvedic Principles of Daily Life | E/G/S |
| 18. | Bharatiya Sampradayamu | T/K/Hi |
| 19. | Book of Prayers | E |

The Books are available in English (E), German (G), Spanish (S), French (F), Hebrew (H), Telugu (T), Hindi (Hi) and Kannada (K) Languages.

| | | |
|---|---|---|
| 20. | Bhagavathamurthy Bheeshmudu | T |
| 21. | Bricks for the Temple | E |
| 22. | Cow | K/T/E/Hi |
| 23. | C.V.V. - Mastaru Yogamu - Sadhana Sutramulu | T |
| 24. | Devapi Maharshi Bodhalu 1 & 2 | T/E/K/Hi |
| 25. | Dharmavigrahudu - Sri Ramudu | T |
| 26. | Dhanakamuni Katha | T |
| 27. | Doctrine of Eternal Presence | E |
| 28. | From the Teachers Pen | E |
| 29. | Gayatri Mantra Avagahana | T |
| 30. | Geetopanishad - Sankya Yogamu | T |
| 31. | Geetopanishad - Karma Yogamu | T |
| 32. | Geetopanishad - Gnana Yogamu | T |
| 33. | Geetopanishad - Karma Sanyasa Yogamu | T |
| 34. | Geetopanishad - Dhyana Yogamu | T |
| 35. | Geetopanishad - Vijnana Yogamu | T |
| 36. | Geetopanishad - Akshra Parabrahma Yogamu | T |
| 37. | Geetopanishad - Rajavidya Rajaguhya Yogamu | T |
| 38 | Geetopanishad - Vibhuthi Yogamu | T |
| 39. | Good Friday | E/S |
| 40. | Gurusisya Samvadamu | T |
| 41. | Healers Handbook | E |
| 42. | Health & Harmony | E/G |
| 43. | Health & Harmony-2 | E |
| 44. | Hercules - The Man and the Symbol | E/G/S |
| 45. | Himalaya Guruparampara | T/Hi/K |

| | | |
|---|---|---|
| 46. | Jupiter - The Path of Expansion | E/G/S |
| 47. | Just Adjust | E |
| 48. | Jyotirlinga Yatra | T |
| 49 | Jyothisha Vignanamu | T |
| 50. | Kapila and Kardama | E/G/S |
| 51. | Katha Deepika | T |
| 52. | Kumara Sambavam | T |
| 53. | Lectures on Secret Doctrine - I | S/E |
| 54. | Lectures on Secret Doctrine - II | E |
| 55. | Lectures on Secret Doctrine - III | E |
| 56. | Listening to the Invisible Master | E/S/K |
| 57. | Lord Maitreya - The World Teacher | E/S |
| 58. | Life and Teachings of Master Jupiter | E |
| 59. | Maitreya Maharshi Bodhalu 1 & 2 | T/K/E/Hi |
| 60. | Mana Master garu | T |
| 61. | MANTRAMS - Their Significance and Practice | E/G/S |
| 62. | Mars - The Kumara | E/G/S |
| 63. | Mercury - The Alchemist | E/G/S |
| 64. | Maria Magdalena | E/S |
| 65. | Marriage - A Sublime Sacrament | E/G/S |
| 66. | Maruvu Maharshi Bodhalu 1 & 2 | T/K/Hi/E |
| 67. | MASTER C.V.V. (Birthday Message) | T/K/E |
| 68. | MASTER C.V.V - Nuthana Yogamu | T/K |
| 69. | MASTER C.V.V. - Yogamu | T |
| 70. | MASTER C.V.V. - Yogamu (Karma Rahityamu) | T/k |
| 71. | Master K. Parvathi Kumar - Short Biography | E |


| | | |
|---|---|---|
| 72. | Master CVV - Saturn Regulations | E/G/S |
| 73. | MASTER CVV The Initiator - MASTER E.K. The Inspirer | E |
| 74. | Master M.N. - A Fiery Flame | E/G/S |
| 75. | MASTER E.K. - The New Age Teacher | E/S |
| 76. | Marana Rahasyam-1 (Markandeya) | T |
| 77. | Marana Rahasyam-2 (Sathi Savitri Devi) | T |
| 78. | Marana Rahasyam-3 (Nachiketudu) | T |
| 79. | Master CSG | E |
| 80. | Messages of Master E.K. | E |
| 81. | MITHILA - A New Age Syllabus | E/G/S |
| 82. | Moon - The Key | E |
| 83. | New Age Hospital Management | E |
| 84. | Nutrients For Discipleship | E |
| 85. | OM | T/K/E |
| 86. | Occult Meditations | E/G/S |
| 87. | Om Namo Narayanaya | E/G/S |
| 88. | On Change | E/S |
| 89. | On Healing | E |
| 90. | On Love | E/G/S |
| 91. | On Service | E/G/S |
| 92. | On Silence | E/G/S |
| 93. | PARIKSHIT-The World Disciple | E |
| 94. | Pranayamam | T |
| 95. | Prayers | E/G/S |
| 96. | RUDRA | E |

| | | |
|---|---|---|
| 97. | Rukmini Kalyanam | T |
| 98. | Sai Sukthulu | T/K |
| 99. | Sai Ki Amruthavani | Hi |
| 100. | Sanghaneethi | T |
| 101. | SAM | E |
| 102. | Saraswathi-The Word | E/G/S |
| 103. | SANKHYA - The Sacred Doctrine | E/S |
| 104. | Saturn - The Path of Systematised Growth | E/G/S |
| 105. | Shodosopachara Pooja - Avagahana | T |
| 106. | SOUND-The Key and its Application | E/G/S |
| 107. | Spiritualism-Business and Management | E/G |
| 108. | Spiritual Healing | S/G |
| 109. | Sri Dattatreya | E/G/S/T |
| 110 | Sripada Srivallabha Charitamrutam | E |
| 111. | Srimadramayana Dharmakusumalu | T |
| 112. | Sri Guru Paadukastavamu | T |
| 113. | SRI LALITHA (Set 10 Books)<br>(Comentary on Sri Lalitha Sahasranamam) | T |
| 114. | SRI SASTRY GARU | T/K/E/S |
| 115. | Sri Krishna Namamrutham | T |
| 116. | Sri Shirdi Sai Sayings | E/G/S |
| 117. | Sri Suktam | E |
| 118. | Steps of Silence | E |
| 119. | Sun that Iam | E/G/S |
| 120. | Temple and the Work | E |
| 121. | Teachings of Lord Maitreya-1 | E |
| 122. | Teachings of Lord Maitreya-2 | E |

| | | |
|---|---|---|
| 123. | The Aquarian Cross | E/G/S |
| 124. | The Aquarian Master | E/G/S |
| 125. | The Doctrine of Ethics | E/S |
| 126. | The Etheric Body | E/G/K |
| 127. | The Golden Stairs | E/S |
| 128. | The Path of Synthesis | E |
| 129. | The Splendor of Seven Hills | E |
| 130. | Thus Spoke-Master Dhwhal Khul | E |
| 131. | THE TEACHER-Meaning and Significance | E |
| 132. | Teachings of Master Koot Hoomi 1 & 2 | E |
| 133. | The Teachings of Lord Kapila | E/G |
| 134. | The Teachings of Master Mourya 1 & 2 | E |
| 135. | The Teachings of Sanath Kumara | E/G/S |
| 136. | The Theosophical Movement | E/G/S |
| 137. | The White Lotus | T/E/S/K |
| 138. | The World Teacher | E |
| 139. | The Mysteries of Sagittarius | E |
| 140. | Time - The Key | E/G |
| 141. | Uranus- The Alchemist of the Age | E/G/S |
| 142. | Varuna Graha Prabhavamu | T/K |
| 143. | VENUS-The Path to Immortality | E/S |
| 144. | Violet Flame Invocations | E |
| 145. | Vrutrasura Rahasyam | T |
| 146. | Wisdom Buds | E/S |
| 147. | Wisdom Teachings of Vidura | E/G/S |
| 148. | Yama Geetha | T |

**Please visit our website**

(www.dhanishta.org / info@dhanishta.org) for prices



మనము ప్రతి నిత్యము ప్రాతఃసమయములో స్మరించవలసిన వారిలో నారదమహర్షి ఒకరు. సృష్టిలో జీవుల కొరకు దిగివచ్చిన మహత్తరమైన ప్రజ్ఞ నారదుడు. మన మేధస్సుకు అందే ప్రజ్ఞ కాదు. భక్తి, జ్ఞానము, దైవము గురించి తెలుసుకోవాలనే తపన ఉన్నప్పుడు మనలో ఊర్ధ్వ లోకాలలో పనిచేస్తాడు. ప్రాపంచిక విషయాల గురించి తపన ఉన్నప్పుడు కలహభోజనుడిగా ఉంటాడు. మాస్టర్ ఇ.కె. గారు చెప్పిన ముఖ్యమైన విషయము ఏమిటంటే నారదుడు మనని గురించిన భావన చేసినపుడు మాత్రమే మనము ఆయన గురించి భావన చేయగలము. నారదుడు ఆకాశమంతా నిండి ఉన్నాడు కాబట్టి మనము స్మరించినంత మాత్రమున ఆశీర్వదించడము జరుగుతుంది. సృష్టిలో ప్రతి వ్యక్తి దేహము నందును నారదుని అంశ ఉండును. జీవులు హరి నామమును గానము చేయ ప్రయత్నించినపుడల్లా నారదునితో సంబంధం యేర్పడును.

ISBN 978-81-89467-58-6

ధనిష్ఠ